## భజన్ క్లబ్బింగ్ అనేది ఒక అద్భుతం



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 263 | పేజీలు: 8+4 | వెల రూ.5


## బీచును శుభ్రం చేసిన సీఎం భార్యాబిడ్డలు



2







# భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర వరద పరిస్థితిపై సీఎం సమీక్ష

**వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం ఇవ్వాలని ఆదేశం**

**రిజర్వాయర్లను నింపడం... వనరులకు నీళ్లు మళ్లించడంపై దృష్టి**

**ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాలని సూచన**

**భారీ వర్షాలతో వివిధ రిజర్వాయర్లల్లో 21 టీఎంసీల మేర నీటి మట్టాలు పెరిగాయని అధికారుల వెల్లడి**

అమరావతి, సెప్టెంబర్ 26,(మనం ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో నదులు, రిజర్వాయర్లలో పెరిగిన ప్రవాహాలు, ముంపు పరిస్థితులపై శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో నివాస ప్రాంతాలు జలమయం కావడం, పంటలు ముంపునకు గురైన పరిస్థితి, తీసుకుంటున్న సహాయక, పునరావాస చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఐదు రోజులుగా

...మిగతా 2లో

**విజయవాడలో మిషన్ కర్మయోగిపై ప్రాంతీయ సదస్సు** 5

## జాతీయ స్థాయిలో ఏపీ సమాచార పౌర సంబంధాల శాఖకు అరుదైన గౌరవం

'స్కోచ్ సిల్వర్ పురస్కారం' దక్కించుకున్న ఐపీఆర్ శాఖ

ఏపీ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్ కు గోల్ స్కోచ్ అవార్డు

మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియలో అత్యంత పారదర్శకతతో రికార్డు

డైరెక్టర్ విశ్వనాథన్ దిశానిర్దేశంలో అరుదైన మైలురాయి



2

## అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

**సర్ వ్యవహారాలపై ఆరోపణలకు వివరణలిచ్చిన సీఈసీ, కమిషనర్లు**



ఢిల్లీ, సెప్టెంబర్ 26: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (సర్)పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సర్' కోసం ఫారం-6కు జతచేసిన డిక్లరేషన్ ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్ బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి శనివారం ఢిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. 'సర్'పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశానంతరం ఎన్నికల సంఘం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖ.. ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై

...మిగతా 2లో

## పని చేసే పార్టీకి అధికారం అప్పగించాలి

**ఎక్కువ కాలం అధికారమిస్తేనే అభివృద్ధి సాధ్యం**

**గుజరాత్ రాష్ట్రం ఒక చక్కటి ఉదాహరణ**

**రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్**




కర్నూలు, సెప్టెంబరు 26: మనం న్యూస్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పని పార్టీలకు అధికారం అప్పగిస్తేనే సాధ్యమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆయన శనివారం స్థానిక కిసాన్ ఘాట్ ఉన్న ఫన్ అండ్ ఫుడ్ హోటల్లో డ్రోన్, సోలార్ ఎక్స్పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘ కాలం ఒకే పార్టీ అధికారంలో ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తయి రాష్ట్రం వేగంగా ముందడుగు వేస్తుందని తెలిపారు. దీన్ని ప్రజలు గుర్తించి కూటమి ప్రభుత్వాన్ని దీర్ఘ కాలం అధికారం అప్పగించాలని ఆయన ప్రజలను కోరారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ గుజరాత్ రాష్ట్రమని గుర్తు చేశారు. అక్కడ దీర్ఘ కాలంగా ఒకే ప్రభుత్వం అధికారంలో

...మిగతా 2లో




## బాధ్యత, అంకితభావంతో విధులు నిర్వర్తించండి

**సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక పోలీస్ శిక్షణ సమాజానికి శ్రీరామరక్ష**

- 138 మంది నూతన ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పరేడ్
- నూతన కానిస్టేబుళ్లకు మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం

రాజమహేంద్రవరం/ అమరావతి, సెప్టెంబర్, 26(మనం ప్రత్యేక ప్రతినిధి): రాజమహేంద్రవరంలోని బీటీసీ కవాతు మైదానంలో 4వ భారత రిజర్వు పోలీసు దళం (ఏపీఎస్పీ) ఆధ్వర్యంలో 2025-26 బ్యాచ్కు చెందిన 138 మంది స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల (ఎస్సీటిపిసి) శిక్షణ ముగింపు వేడుక (పాసింగ్ అవుట్ పరేడ్) శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖా మాత్యులు

...మిగతా 2లో

## సీఈసీపై కార్యాచరణ!

**యాక్షన్ ప్లాన్‌ను నిర్ణయించేందుకు 30న ఇండి కూటమి సమావేశం**




ఢిల్లీ, సెప్టెంబర్ 26: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కు ఒత్తిడి పెంచే దిశగా విపక్షాలు కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఈ అంశంపై చేపట్టాల్సిన ఆందోళనలపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు ఈ నెల 30న ఢిల్లీలో భేటీ కానున్నారు. జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తప్పించాలనే

...మిగతా 2లో



## వేట నిలిచినా.. మత్స్యకార కుటుంబాలకు భరోసా

**తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి 50 కిలోల ఉచిత బియ్యం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో బాధిత కుటుంబాలకు చేయూత**

**బియ్యం పంపిణీకి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

అమరావతి, సెప్టెంబర్ 26,(మనం ప్రత్యేక ప్రతినిధి): తుఫాను హెచ్చరికలు, ప్రతికూల వాతావరణంతో వేట సాగక ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి మత్స్యకార

...మిగతా 2లో



## రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రత శాఖ దాడులు

**28 జిల్లాల్లో 70 హోటళ్లు, రెస్టారెంట్లపై ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు**

**25 సంస్థల మూసివేత.. 30 కేసుల నమోదు**

**ఇందులో 10 కేసులు ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకపోవడంపై.. మిగిలినవి అపరిశుభ్రతపై..**

**మరో 15 సంస్థలకు నోటీసులు**

**దాడుల నివేదికను మంత్రి సత్యకుమార్‌కు సమర్పించిన అధికారులు**

అమరావతి,సెప్టెంబర్, 26,(మనం ప్రత్యేక ప్రతినిధి): ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రత శాఖ అధికారులు శనివారం విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 28 జిల్లాల్లో ఒకేసారి చేపట్టిన ఈ తనిఖీల్లో 70 హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార సంస్థలను పరిశీలించారు. నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిన 25 సంస్థలను మూసివేశారు. 30 చట్టపరమైన కేసులు నమోదు చేశారు. మిగిలిన 15 సంస్థలకు నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలతో కూడిన నివేదికను అధికారులు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్

...మిగతా 2లో

## రాయలసీమకు ఉద్యాన సిరులు.. రైతన్నకు ఆదాయ భరోసా

**రూ.లక్ష కోట్ల సమగ్ర పెట్టుబడుల ప్రణాళికతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'** 4

- 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు.. 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం లక్ష్యం
- అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా ఐహెచ్డీపీ ప్రారంభం
- కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి ప్రజలను భాగస్వాములను చేయాలి: మంత్రి అచ్చెన్నాయుడు




## ఎన్నిక ఏదైనా కూటమిదే ఘనవిజయం: మంత్రి దుర్గేష్

విజయవాడ,సెప్టెంబర్,26,(మనం ప్రతినిధి): విజయవాడలోని డీవీ మేనర్ హోటల్ వేదికగా శనివారం ఎన్టీఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి, ఎన్టీఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేటర్ కందుల దుర్గేష్ హాజరై, కూటమి నాయకులతో భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ తరపున విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు, మక్కెన మల్లిఖార్జున రావు, గద్దె అనురాధ, జనసేన పార్టీ నాయకులు అమ్మిశెట్టి వాసు, శ్రీకాంత్, బండి కోమలి, అలాగే బీజేపీ నేతలు అడ్డూరి శ్రీరామ్, ఉప్పలపాటి శ్రీనివాసరావు తదితర ప్రముఖ కూటమి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పరిధిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు పోటీ చేసే ప్రతి స్థానంలోనూ విజయఢంకా మోగించాలని, వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని కూటమి నేతలే నిర్ణయించారు.కూటమి తరపున బరిలో నిలిచే ఏ అభ్యర్థినైనా గెలిపించేందుకు నాయకులందరూ అంకితభావంతో పనిచేయాలని, స్థానిక పరిస్థితులకు తగినట్లుగా పకడ్బందీ వ్యూహాలను రచించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి ఓటర్ల మద్దతు కూడగట్టాలని సూచించారు.

## చోరీల్లోనూ ఏఐ ఘనాపాటీయే

### అమెరికా ప్రభుత్వ వెబ్ సైట్లలోకి చొరబడ్డ ఓపెన్ ఏఐ



న్యూయార్క్, సెప్టెంబర్ 26: అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అందుకు అనుగుణంగానే ఇటీవల పలు ఏఐ మోడళ్లు సైబర్ దాడులకు పాల్పడినట్లు తేలడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా మరో ఘటన వెలుగుచూసింది. ఓపెన్ ఏఐ మోడళ్లు అమెరికా ప్రభుత్వానికి చెందిన పలు వెబ్ సైట్లలోకి ప్రవేశించి సమాచారాన్ని సేకరించింది. దీంతో పలు

...మిగతా 2లో

### రూ.1000 కోట్లు కొల్లగొట్టిన సైబర్ కేటుగాళ్లు

రోమ్, సెప్టెంబర్ 26: ఏఐని ఉపయోగించి.. ఓ బ్యాంకుకు రూ.వేల కోట్లు కుచ్చుటోపి వేశారు సైబర్ కేటుగాళ్లు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ గా నమ్మించి రూ.1034 కోట్లు కొల్లగొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ భారీ మోసం ఇటలీలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు ఇంటెసా శాన్పాలోలో చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇటలీలో అతిపెద్ద బ్యాంకు ఇంటెసా శాన్పాలో సంబంధిత

...మిగతా 2లో

## అమెరికా ప్రభుత్వ వెబ్ సైట్లలోకి చొరబడ్డ ఓపెన్ ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ విభాగాలను కంపెనీ అలర్ట్ చేసింది. అమెరికా సెన్సస్ బ్యూరో, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌తో పాటు పలు ప్రభుత్వ వెబ్సైట్లలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని తమ ఏఐ మోడళ్లు యాక్సెస్ చేసుకున్నాయని ఓపెన్ ఏఐ తెలిపింది. ఏఐ బాట్లకు శిక్షణ, వాటి సాంకేతిక సామర్థ్యాలను అంచనా వేసే ఈ సమాచార సేకరణ జరిగినట్లు ధ్రువీకరించింది. ప్రజలకు అందుబాటులో ఉన్న సమాచారాన్నే ఏఐ మోడళ్లు యాక్సెస్ చేశాయని పేర్కొంది.

ఏఐ బాట్ల వల్ల ప్రభావితమైన వెబ్సైట్లు, ఆన్లైన్ సెంటర్లు, విశ్వవిద్యాలయాలు, పలు సంస్థలను గుర్తించి అప్రమత్తం చేసినట్లు ఓపెన్ ఏఐ వెల్లడించింది. ఏఐ మోడళ్లు హద్దులు దాటి ప్రవర్తించిన ఘటనలపై ఈ కంపెనీ విస్తృత దర్యాప్తు చేపట్టింది. ఇది పూర్తి కావడానికి మరికొన్ని నెలలు పట్టొచ్చని ఓపెన్‌ఏఐ పేర్కొంది. కాగా.. ఇటీవలే ఆస్ట్రేలియా ప్రభుత్వ వెబ్సైట్లోకి ఓపెన్ ఏఐకి చెందిన ఓ మోడల్ అనధికారికంగా ప్రవేశించిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆరంభంలో ఈ హ్యాకింగ్ జరిగినట్లు కంపెనీ వెల్లడించింది. అయితే, ఈ ఘటనలో వ్యక్తిగత సమాచారం బయటకు రాలేదని ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తెలిపారు.

**వేగంగా పనిచేయలేకపోయాం: శామ్ ఆల్ట్మన్**

ఈ వరుస ఘటనల నేపథ్యంలో ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్మన్ స్పందించారు. ''సమస్య పరిష్కారంలో ఆశించినంత వేగంగా పనిచేయలేకపోతున్నాం. భారీ మొత్తంలో యాక్టివిటీ లాగ్లను పరిశీలించి, అందులోని సమాచారాన్ని గుర్తించాల్సి ఉంది. అదే సమయంలో పారదర్శకతనూ కొనసాగించాలి. ఏఐ మోడళ్ల ప్రభావానికి గురైన సంస్థలతో కలిసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన వనరులు పెంచుతున్నాం అని ఆల్ట్మన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని వివరించింది. అలాగే, 'బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. తమ పేర్లు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, యువకులు, మొదటిసారి ఓటు వేసేవారు.. నిరంతర అప్డేషన్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు కోసం సంబంధిత ఈఆర్వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు తక్షణమే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నారు' అని తెలిపింది.

దేశవ్యాప్తంగా 'సర్' నిర్వహణ సహా ఈ మధ్య కాలంలో ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంది. బిహార్ నుంచి మొదలు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కోసం గతేడాది జూన్ 24నాటి ఆదేశాలు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయి. దీన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించింది' అని ఈసీ పేర్కొంది.గోవాలో 97 మంది అర్హులకు తుది ఓటర్ల జాబితాలో చోటుదక్కకపోవడంపై స్పందిస్తూ.. 'ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హుల నుంచి దరఖాస్తులు సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను గోవా సీఈవో ఆదేశించారు. ఆ 97 మంది ఓటర్లలో ఇప్పటికే 81 మంది 'ఫారం-6' నింపారు' అని వెల్లడించింది.

## సీఈసీపై కార్యాచరణ!

(మొదటి పేజీ తరువాయి)

తమ డిమాండ్‌పై పరస్పరం సంప్రదింపులు జరిపి.. ఉమ్మడి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయంపై 29న కాంగ్రెస్ ప్రత్యేకంగా సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు మరోసారి పార్లమెంటు ఉభయ సభల్లో నోటీసులు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన 73 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన ప్రతిపక్ష కూటమి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ అభిశంసన నోటీసు ఇచ్చింది. అది రాజ్యసభలో పెండింగులో ఉంది. అది అలా ఉండగానే మరోసారి నోటీసు ఇవ్వాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. కాగా.. సర్ ప్రక్రియలో అవకతవకలు, ఇతర సమస్యలపై ఇప్పటికే 23 రాజకీయ పార్టీలు, ఓ స్వతంత్ర ఎంపీ ఈ వ్యవహారంపై న్యాయ సలహాల కోసం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను సంప్రదించాయి.

## వేట నిలిచినా.. మత్స్యకార కుటుంబాలకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)



కుటుంబానికి 50 కిలోల చొప్పున ఉచిత బియ్యం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సముద్రంలో వేటే జీవనాధారంగా ఉన్న మత్స్యకారులు ప్రతికూల వాతావరణంతో ఉపాధికి దూరమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి పేర్కొన్నారు. ఆయా కుటుంబాల పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి ఉచిత బియ్యం అందించాలని నిర్ణయించారని తెలిపారు. ఆపద సమయంలో బాధితులకు సకాలంలో సహాయం అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని చెప్పారు. బియ్యం పంపిణీకి సంబంధించి జిల్లాల యంత్రాంగానికి అవసరమైన ఆదేశాలు ఇచ్చామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. తుఫాను ప్రభావిత తీర ప్రాంతాల్లో అర్హులైన మత్స్యకార కుటుంబాలన్నింటికీ ఈ సహాయం అందుతుందని స్పష్టం చేశారు. వేట నిలిచిపోయిన వేళ వారి కుటుంబాల ఆహార అవసరాలకు ఈ నిర్ణయం తోడ్పడుతుందని పేర్కొన్నారు. వాతావరణం అనుకూలించే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అధికారులు జారీ చేసే హెచ్చరికలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. మత్స్యకారుల ప్రాణ రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రతికూల పరిస్థితుల్లో వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**పారాదీప్కు సురక్షితంగా చేరిన కాకినాడ మత్స్యకారుల పడవ**

కాకినాడ నుంచి చేపల వేటకు వెళ్లిన మోటరైజ్డ్ పడవ శనివారం ఉదయం ఒడిశాలోని పారాదీప్కు సురక్షితంగా చేరుకున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పడవలో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని వెల్లడించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో మత్స్యకారులు తమ భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

## భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర వరద పరిస్థితిపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సముద్రంలోకి వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా 50 కేజీల బియ్యం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సహాయాన్ని అందించేందుకు అన్ని రకాలుగా సిద్దంగా ఉండాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఎగువనున్న రాష్ట్రాల నుంచి ప్రస్తుతం పెద్దగా ప్రవాహాలు లేవని, స్థానికంగా వస్తున్న వరద నీటి కారణంగానే ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్థానికంగా వచ్చే వరద నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. అలాగే పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్యన ఓ కొత్త బ్యారేజీ నిర్మాణం అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. దీంతో పాటు ప్రకాశం బ్యారేజీ దిగువన కూడా ఇంకో బ్యారేజీ నిర్మించాల్సిన అవసరాన్ని గతంలోనే ఆలోచన చేసిన విషయాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇరిగేషన్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో తక్షణమే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. లిఫ్ట్ పనులను పూర్తి చేసి వంశధార నీటిని హిర మండలం రిజర్వాయర్లోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వివిధ జిల్లాల్లో రిజర్వాయర్లను నింపేందుకు తీసుకుంటున్న చర్యలను కూడా సీఎం సమీక్షించారు. తాజా వర్షాలతో రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కోస్తాంధ్రలో ప్రస్తుతం 19.80 శాతం, రాయలసీమలో 42 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయని, అయితే ఉత్తరాంధ్రలో ఎగువ ప్రాంతాల నుంచి నదుల్లోకి నీటి ప్రవాహాలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను కొనసాగించాలని సీఎం ఆదేశించారు.

**రిజర్వాయర్లల్లో నీటి మట్టాలు.. బేసిన్ల వారీ ప్రవాహాలపై సీఎం ఆరా**

ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ రిజర్వాయర్లల్లో నీటి మట్టాలు ఎలా ఉన్నాయి..? అలాగే వివిధ నదుల పరీవాహక ప్రాంతాల్లో ప్రవాహాల వివరాలను సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 29 రిజర్వాయర్లల్లో నీటి మట్టాలు పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సెప్టెంబర్ 23వ తేదీన ఆయా రిజర్వాయర్లలో నీటి మట్టాలు 101 టీఎంసీలు ఉండగా... 26వ తేదీ నాటికి 21 టీఎంసీలు మేర నీటి మట్టాలు పెరిగాయని ఇరిగేషన్ అధికారులు చెప్పారు. ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల పరిధిలో సుమారు 5 టీఎంసీల మేర నీటి మట్టాలు పెరిగాయని తెలిపారు. ఇక కాకినాడ, పోలవరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పల్నాడు, నెల్లూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లోని 18 రిజర్వాయర్ల పరిధిలో సుమారు 16 టీఎంసీల మేర నీటి మట్టాలు పెరిగాయని అధికారులు వెల్లడించారు. పెరిగిన ఈ నీటి మట్టాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక వివిధ బేసిన్లల్లోని ప్రవాహాల విషయానికొస్తే... కృష్ణా, గోదావరి, నాగావళి, వంశధార బేసిన్లల్లో నీటి ప్రవాహాలు గతంతో పోల్చుకుంటే పెరిగాయని అధికారులు వివరించారు. ఉత్తరాంధ్రలో నదుల ప్రవాహాలు, ముంపు పరిస్థితిని మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా జిల్లాల్లోని రిజర్వాయర్లలోకి వస్తున్న నీటి ప్రవాహాలు, నిల్వ పరిస్థితిని ఇరిగేషన్ అధికారులు వివరించారు. వంశధార పరివాహక ప్రాంతంలో గొట్టా బ్యారేజీకి సెప్టెంబరు 20న 7,214 క్యూసెక్కుల ఇన్ఫ్లో ఉండగా, 25న 47,100 క్యూసెక్కులకు పెరిగిందని అధికారులు తెలిపారు. నాగావళి పరివాహక ప్రాంతంలోని నారాయణపురం ఆనకట్టకు ఇన్ఫ్లో 2,100 నుంచి 49,800 క్యూసెక్కులకు పెరిగిందని, మడ్డువలస ప్రాజెక్టులో గతంలో 918 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటే.. ప్రస్తుతం 18 వేల క్యుసెక్కుల మేర నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. దీంతో మడ్డువలస ప్రాజెక్టులో నీటి నిల్వ నీటి నిల్వ 1.61 టీఎంసీల నుంచి 2.79 టీఎంసీలకు చేరిందని వివరించారు.తోటపల్లి బ్యారేజీకి కూడా భారీగా ప్రవాహం వచ్చిందని తెలిపారు. ఈ బ్యారేజీ వద్ద గతంలో 2,484 క్యూసెక్కుల నీటి ప్రవాహాలు ఉండగా... ప్రస్తుతం 23,250 క్యూసెక్కుల మేర ప్రవాహం ఉందని అధికారులు వెల్లడించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లలోనూ నీటి మట్టాలు పెరిగాయని అధికారులు తెలిపారు. సెప్టెంబరు 20న 11.67 టీఎంసీలుగా ఉన్న డొంకరాయి రిజర్వాయర్ నిల్వ సెప్టెంబర్ 25వ తేదీ నాటికి 15.78 టీఎంసీలకు చేరిందని, సీలేరు (గుంటవాడ) రిజర్వాయర్లో నిల్వ 1.52 నుంచి 3.90 టీఎంసీలకు పెరిగిందని వివరించారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద భారీగా ప్రవాహాలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ సెప్టెంబర్ 20వ తేదీన 1.20 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటే... ఈ నెల 25వ తేదీ నాటికి ఆ ప్రవాహాలు 3.50 లక్షల క్యూసెక్కులకు చేరిందని అధికారులు వెల్లడించారు. సెప్టెంబరు 20న ప్రకాశం బ్యారేజీకి 8,187 క్యూసెక్కుల ఇన్ఫ్లో ఉండగా, 25న అది 40,521 క్యూసెక్కులకు పెరిగినట్లు తెలిపారు. మున్నేరుకు వచ్చే ప్రవాహం కూడా 3,210 నుంచి 9,000 క్యూసెక్కులకు పెరిగిందని వివరించారు. పెరిగిన ప్రవాహాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. ఓవైపు సహాయక చర్యలపై దృష్టి పెడుతూనే.. మరోవైపు రిజర్వాయర్లకు నీటని మళ్లించే అంశంపై దృష్టి సారించాలన్నారు. అలాగే చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి వినియోగం ఉండాలని.. అలాగే నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సహా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఈ టెలికాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

## బాధ్యత, అంకితభావంతో విధులు నిర్వర్తించండి

(మొదటి పేజీ తరువాయి)

కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి, నూతన కానిస్టేబుళ్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, అడిషనల్ ఎస్పీ దేవరాజ్ తదితర ప్రముఖులు గౌరవ అతిథులుగా హాజరై తిలకించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కఠిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని, మైదానంలో యువ పోలీసులు ప్రదర్శించిన కవాతు అందరినీ ఎంతగానో ఆకట్టుకుందన్నారు. గ్యాలరీలో కూర్చుని తమ కుమారుల ప్రదర్శనను వీక్షించిన తల్లిదండ్రులు కన్న కలలు సాకారమైన వేళ నిజమైన పుత్రోత్సాహాన్ని ఆస్వాదించారని మంత్రి దుర్గేష్ భావోద్వేగంతో పేర్కొన్నారు.కేవలం శారీరక దారుఢ్యమే కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ క్రైమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై శిక్షణ పొందడం సమాజానికి ఎంతో ప్రయోజనకరమని మంత్రి కొనియాడారు.యువతలో మానవ విలువలను పెంపొందించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ద్వారా ప్రవచనాలు ఇప్పించడం ఉద్యోగ ధర్మానికి, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సారథ్యంలో ఏపీ పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో ముందుంటుందని అన్నారు. నూతనంగా విధుల్లోకి అడుగుపెడుతున్న కానిస్టేబుళ్లు అత్యంత బాధ్యత, అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు.పెడధోరణిలో వెళ్తున్న సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడిపించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు సమగ్రంగా సమన్వయంతో పనిచేయాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

అంతకుముందు, 4వ ఐ.ఆర్. బెటాలియన్ కమాండెంట్ పి. సత్తిబాబు మరియు ఇతర అధికారులు మంత్రి దుర్గేష్ కి పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. శిక్షణ కాలంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్డోర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రొబేషనరీ కానిస్టేబుళ్లకు మంత్రి దుర్గేష్ తన చేతుల మీదుగా జ్ఞాపికలు, అత్యుత్తమ బెటాలియన్ టీమ్కు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, సౌత్ జోన్ డీఎస్పీ ఏ. శివ ప్రియ, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మరియు శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీచును శుభ్రం చేసిన సీఎం భార్యాబిడ్డలు

ముంబై, సెప్టెంబర్ 26: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సతీమణి అమృత, కుమార్తె దివిజ ముంబయిలోని జుహూ బీచును శుభ్రం చేశారు. గణేశ్ నిమజ్జనోత్సవం నేపథ్యంలో అమృత నేతృత్వంలోని దివ్యాజ్ ఫౌండేషన్.. బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)తో కలిసి బీచ్ వద్ద స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టింది. ఇందులో బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ కూడా పాల్గొన్నారు.

''మన ముంబయి మహా నగరానికి ఈ సముద్రం అందాన్ని, గుర్తింపును ఇస్తుంది. సముద్ర తీరాలను శుభ్రంగా ఉంచడం కేవలం పౌర బాధ్యత మాత్రమే కాదు.. నగరం పట్ల మన నిబద్ధత కూడా.. పర్యావరణ పరిరక్షణ కోసం మరింత మంది ప్రజలు, ముఖ్యంగా యువత ముందుకు వచ్చేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యం'' అని అమృత పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజలందరి బాధ్యత అని అజయ్ దేవగణ్ పేర్కొన్నారు. ఇళ్లను శుభ్రంగా ఉంచుకున్నట్లే.. మన నగరాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని కూడా శుభ్రంగా ఉంచాలని ఆయన పిలుపునిచ్చారు.

## పని చేసే పార్టీకి అధికారం అప్పగించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం కారణంగా అభివృద్ధి శరవేగంగా సాగుతూ దేశంలో అగ్రగామిగా నిలబడిందని మంత్రి భరత్ తెలిపారు. 2014 - 2019లో అధికారంలో ఉండగా చేసిన అభివృద్ధి.. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కారణంగా మట్టిలో కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన గత రెండేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ అభివృద్ధి ఇలాగే ముందుకు సాగాలంటే భవిష్యత్తులో కూడా తెలుగుదేశం పార్టీ ఆధర్యంలోని కూటమి ప్రభుత్వం దీర్ఘకాలం అధికారంలో ఉండాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారంటే ఆయనపై వారికి ఉన్న నమ్మకమేనని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో అక్కడ ఉన్న వనరులు, అవకాశాలను బట్టి పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని వివరించారు. కర్నూలు జిల్లాలో సుమారు రూ.50వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. పరిశ్రమలు, డ్రోన్ హబ్, తాజాగా విమాన పైలట్లకు శిక్షణ ఇచ్చే సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభిస్తోందని భరత్ వెల్లడించారు. ప్రస్తుతం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని అందులో డ్రోన్ శరవేగంగా దూసుకుపోతోందని ఆయన తెలిపారు. యుద్ధరంగంలో డ్రోన్ వినియోగం కారణంగా మనషుల ప్రాణాలకు ముప్పు తగ్గిందని ఆయన గుర్తు చేశారు. ఇటీవలి కాలంలో యుద్ధం జరుగుతున్న దేశాల్లో డ్రోన్ వినియోగం గణనీయంగా పెరిగిందని స్పష్టం చేశారు. ఒక వైపు జవాన్లకు సేవలందిస్తూనే మరో వైపు కిసాన్లకు కూడా డ్రోన్ తన సేవలను విస్తృత పర్చిందని తెలిపారు. వ్యవసాయ రంగంలో పురుగు మందుల, రసాయనిక ఎరువుల వాడకం వంటివి ఇపుడు డ్రోన్లు చేస్తున్నాయని వెల్లడించారు. అంతేగాకుండా ఆపాత్కాలంలో ఆపదలో ఉన్న వారికి మందులు, ఆహారం, తాగునీరు అందించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కర్నూలులో అఖిల్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో గరుడ ఏరోస్పేస్ వారు డ్రోన్ పైలట్ శిక్షణా కార్యక్రమాన్ని డిజిసిఏ సహకారంతో ఇవ్వడం ఆనందదాయకమన్నారు. పొదుపు మహిళలకు డ్రోన్ పైలట్ శిక్షణ ఉచితంగా ఇవ్వడమే కాకుండా అత్యధిక సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్లను అందించి వారి ఆర్థికాభివృద్ధికి కేంద్రం తోడ్పాటు అందించడం హర్షనీయమన్నారు. ఈ పథకాన్ని పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే డిజిసిఏ ఇచ్చే పైలట్ లైసెన్సు కారణంగా యువత డ్రోన్ వినియోగాన్ని ఉపాధిగా ఎంచుకోవచ్చని సూచించారు. ఇక సోలార్ విద్యుత్తు ఉత్పత్తి విషయంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక విద్యుత్తు ఉత్పత్తి చేస్తోందన్నారు. ప్రస్తుత ఎల్నినో కారణంగా రాబోయే రోజుల్లో సోలార్ విద్యుత్తుపై ఆధారపడాల్సి వస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకొని అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్తు కోతల నుంచి ఉపశమనం పొందవచ్చని సూచించారు. మన ప్రాంతంలో సోలార్ విద్యుత్తు ఉత్పతికి అనువైన ప్రాంతం అని సోలార్ విద్యుత్తు ఉత్పత్తి రంగంలో నిపుణులు స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## రూ.1000 కోట్లు కొల్లగొట్టిన సైబర్ కేటుగాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

విభాగమైన ఫిడ్యూరామ్ మాజీ ఛైర్మన్ పావొలో మొలెసినిని ఫిబ్రవరిలో కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. ఇంటెసా శాన్పాలో సీఈఓ కార్లో మెస్సీనాలా నమ్మబలికి ఏఐ వాయిస్ క్లోనింగ్ సృష్టించి ఫోన్ కాల్ చేశారు. దీంతో మాజీ ఛైర్మన్ పావొలో ఇదంతా నిజమనుకొని.. విదేశీ ఖాతాల్లోని నిధులను ట్రాన్స్‌ఫర్ చేయాలని తన ఫైనాన్స్ విభాగాన్ని ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలను ఫిడ్యూరామ్ సంస్థ వెంటనే గుర్తించి.. తక్షణమే విదేశాల్లోని బ్యాంకులను, సిబ్బందిని అలర్ట్ చేసినట్లు సదరు కథనాలు తెలిపాయి. ఈ చర్యల వల్ల దాదాపు రూ.570 కోట్ల నగదును రికవరీ చేయగలిగారు. కానీ, మిగతా మొత్తం పలు విదేశీ ఖాతాల్లోకి బిట్కాయిన్, ఇతర క్రిప్టోకరెన్సీలుగా మారిపోవడంతో వాటిని గుర్తించలేకపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతున్నది.

## రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రత శాఖ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

యాదవ్కు సమర్పించారు. ఈ రాష్ట్రవ్యాప్త తనిఖీలను ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి. వీరపాండియన్, ఐఏఎస్, ఐపీఎం, ఆహార భద్రత శాఖ సంచాలకులు, ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం డీజీ సి. అరుణ్బాబు, ఐఏఎస్ పర్యవేక్షించారు. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ బి. శ్రీనివాస్తో పాటు 40 మంది ఆహార భద్రత అధికారులు, 13 మంది సహాయ ఆహార నియంత్రణ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్ డిపార్ట్మెంట్ శనివారం రాత్రి ఓ ప్రకటన జారీ చేసింది.

**25 సంస్థల మూసివేత**

పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలను తీవ్రంగా ఉల్లంఘించిన 25 రెస్టారెంట్లు, ఆహార సంస్థలను అధికారులు మూసివేశారు. ముఖ్యంగా వంటగదుల్లో అపరిశుభ్ర పరిస్థితులు, ఆహార పదార్థాల నిల్వలో నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలు గుర్తించారు. విజయవాడలోని భవానీపురం క్యాసరోల్ రెస్టారెంట్ వంటగదిలో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అక్కడికక్కడే వంటగదిని మూసివేశారు.

**మిగిలిన 15 సంస్థలకు నోటీసులు**

అవసరమైన పరిశుభ్రత, పారిశుద్ధ్య, నిర్వహణ ప్రమాణాలను పాటించని మిగిలిన 15 ఆహార సంస్థలకు నోటీసులు జారీ చేశారు. ఆహార భద్రత నిబంధనలకు అనుగుణంగా అవసరమైన మార్పులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.



**ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా వ్యాపారం.. 30 కేసులు**

చట్టబద్ధమైన నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న సంస్థలపై మొత్తం 30 కేసులు నమోదు చేశారు. ఇందులో 10 కేసులు చెల్లుబాటు అయ్యే ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా కార్యకలాపాలు నిర్వహించినందుకు నమోదు చేశారు. మిగిలిన 20 కేసుల్లో హోటళ్ల వంటగదులు, ఆహార తయారీ ప్రదేశాలు, పరిసర ప్రాంతాల్లో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

**100 కిలోలకు పైగా పాత ఆహారం ధ్వంసం**

తనిఖీల సందర్భంగా 100 కిలోలకు పైగా వండిన ఆహారాన్ని ఎక్కువ కాలం ఫ్రీజర్లలో నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వినియోగానికి అనువుగా లేని ఈ ఆహారాన్ని స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు.తనిఖీల్లో బయటపడిన ప్రధాన లోపాలు ఆహార తయారీ, నిల్వ, వంటగదుల నిర్వహణలో పలు తీవ్రమైన లోపాలను అధికారులు గుర్తించారు.

**కృత్రిమ రంగులు, రుచిని పెంచే పదార్థాలు:**

కొన్ని సంస్థల్లో అనుమతిలేని కృత్రిమ ఆహార రంగులు, రుచిని పెంచే పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు.

**వృక్ష నూనెలతో తయారు చేసిన పన్నీర్:**

స్వచ్ఛమైన పాలకు బదులుగా వృక్ష నూనెలను ఉపయోగించి తయారు చేసిన పన్నీర్ను కొన్ని సంస్థల్లో వినియోగిస్తున్నట్లు గుర్తించారు.

**ఫ్రీజర్లలో అపరిశుభ్రంగా ఆహార నిల్వ:**

వండిన శాకాహార, మాంసాహార పదార్థాలను అపరిశుభ్రమైన ఫ్రీజర్లలో ఎక్కువ కాలం నిల్వ ఉంచుతున్నట్లు గుర్తించారు. కొన్ని చోట్ల ఆహారాన్ని మూతలు, కవర్లు లేకుండా నిల్వ ఉంచారు.

నిల్వ చేసిన ఆహారాన్ని తేదీల వారీగా మార్చే విధానాన్ని కూడా పాటించడం లేదని అధికారులు గుర్తించారు.

## జాతీయ స్థాయిలో ఏపీ సమాచార పౌర సంబంధాల శాఖకు అరుదైన గౌరవం

**న్యూఢిల్లీ,అమరావతి, సెప్టెంబర్,26,(మనం ప్రత్యేక ప్రతినిధి):** పాలనా పారదర్శకత, జవాబుదారీతనం, డిజిటల్ సేవలను అందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు జాతీయ స్థాయిలో మరో అరుదైన గుర్తింపు లభించింది. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించి ప్రతిష్ఠాత్మక స్కోచ్ సిల్వర్ పురస్కారాన్ని సొంతం చేసుకుంది.

శనివారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్లో ఘనంగా జరిగిన 109వ స్కోచ్ సమ్మిట్ వేదికగా సమాచార పౌర సంబంధాల శాఖ ఈ గవర్నెన్స్ విభాగంలో మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినందుకు మీడియా అక్రిడిటేషన్ మేనేజ్మెంట్ సిస్టం అంశం గాను సిల్వర్ స్కోచ్ అవార్డు దక్కింది. ఈ అవార్డును సమాచార శాఖ డైరెక్టర్ తరపున జాయింట్ డైరెక్టర్ ఐ.సూర్యచంద్రరావు, ఆర్.ఐ.ఈ డా.నాగరాజ అందుకున్నారు. స్కోచ్ అధికారిక రికార్డుల్లోనూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ చేపట్టిన ఈ డిజిటల్ అక్రిడిటేషన్ విధానం పారదర్శకతకు ప్రతీకగా నమోదైంది.

**అక్రిడిటేషన్ విప్లవాత్మక మార్పులతో దేశవ్యాప్తంగా ప్రశంసలు**

సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్ అందిస్తున్న సమర్థవంతమైన మార్గదర్శకత్వం అక్రిడిటేషన్ ప్రక్రియను డిజిటలైజ్ చేయడంలో కీలకపాత్ర పోషించింది. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీలో ఎలాంటి సిఫార్సులు లేకుండా, పూర్తిగా నిబంధనలకు కట్టుబడి వ్యవహరించడం విశేషం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనకు ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ జాతీయ పురస్కారం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. మీడియా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, టెక్నాలజీని జోడించి దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించడం, అర్హులైన జర్నలిస్టులకు సకాలంలో అక్రిడిటేషన్లు అందజేయడం వంటి చర్యల ద్వారా ఎలాంటి జాప్యానికి తావులేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

**ఏపీ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు గోల్ స్కోచ్ అవార్డు**

సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్ డిజిటల్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్ ఆఫ్ అమరావతి 'క్వాంటం వ్యాలీ' అంశంలో (అమరావతి) గోల్ స్కోచ్ అవార్డును అందుకుంది. ఈ అవార్డును డిజిటల్ కార్పొరేషన్ ఈడి రాణి సుస్మిత, స్పెషల్ ఆఫీసర్ శేషు కుమార్ అందుకున్నారు.

**టీమ్ ఐ పీఆర్ అంకితభావానికి దక్కిన అరుదైన గుర్తింపు**

ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. మీడియా రంగానికి మరింత పారదర్శకమైన సేవలు అందించేందుకు శాఖ చేస్తున్న కషికి ఈ స్కోచ్ అవార్డులు లభించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ జాతీయ పురస్కారాలు కేవలం శాఖకు మాత్రమే దక్కిన విజయం కాదని, అక్రిడిటేషన్ మరియు డిజిటల్ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అహర్నిశలు శ్రమించిన 'టీమ్ ఐ పీఆర్' ప్రతి ఒక్కరి అంకితభావానికి, సమిష్టి కషికే దక్కిన గౌరవమని ఆయన అభివర్ణించారు.అలాగే, ఏపీ డిజిటల్ కార్పొరేషన్కు 'గోల్ స్కోచ్ అవార్డు' రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ సంస్థ అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. పారదర్శక పాలనను మరింత బలోపేతం చేసేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని, భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తూ, డిజిటల్ రంగంలోనూ రాణిస్తూ జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ కీర్తిని ఇనుమడింపజేస్తున్న సమాచార పౌర సంబంధాల శాఖ మరియు ఏపీ డిజిటల్ కార్పొరేషన్ పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# రాయదుర్గంలో రూ.46 కోట్లతో రైల్వే వంతెన పనులు ప్రారంభం



**రాయదుర్గం సెప్టెంబర్ 26 మనం న్యూస్ :** అభివృద్ధి చరిత్రలో ఈరోజు మరో కీలక మైలురాయిని అధిగమించబోతున్నామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. అభివృద్ధిలో చరిత్ర సృష్టించింది తెలుగుదేశం పార్టీనేనని, నేడు అదే చరిత్రను తిరగరాస్తున్నది తామేనని ఆయన స్పష్టం చేశారు. రాయదుర్గం పట్టణంలో రూ.46 కోట్ల వ్యయంతో నూతన రైల్వే వంతెన నిర్మాణం పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి బలమైన పునాది పడిందన్నారు. ప్రధాన రహదారి విస్తరణతో రాయదుర్గం పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టడంతో పాటు, రెండు రైల్వే వంతెనల నిర్మాణానికి అప్పట్లోనే చర్యలు చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలో ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే రాయదుర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికంగా నిధులు కేటాయించడంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వాటిలో కొన్ని పనులు అప్పట్లోనే పూర్తికాగా, మరికొన్ని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్ధంతరంగా నిలిచిపోయాయని ఆరోపించారు. ముఖ్యంగా అనంతపురం-రాయదుర్గం రహదారి మధ్య నిలిచిపోయిన రైల్వే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అధికారులు రూ.46 కోట్ల నిధులు అవసరమని అంచనాలు రూపొందించారన్నారు. తరువాత ఆ నిధులను ఎలా సమకూర్చాలన్నది సమస్యగా మారిందన్నారు. రైల్వే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులను కోరామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ఈ పెండింగ్ పనిని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

# నియోజకవర్గ ప్రజలు సోలార్ వైపు అడుగులువేయాలి




**ఏలేశ్వరం, సెప్టెంబర్,26(మనం న్యూస్):** కాకినాడ జిల్లా ఏలేశ్వరం పట్టణం షిర్డీ నగర్ లో కోరుకొండ రామకృష్ణ, కోటిలింక నాగేంద్ర, చాగంటి స్వామి,తో నూతనముగా చేపట్టిన యన్ యన్ సోలార్ సొల్యూషన్ వ్యాపార సంస్థను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతులు మీదుగా ప్రారంభించారు. ప్రజలు సోలార్ వైపు అడుగులు వేయాలని తెలిపారు. సోలార్ వినియోగం ద్వారా డబ్బులు ఆదా చేసుకోవచ్చని అన్నారు. ప్రొప్రైటర్ కోరుకొండ రామక్రిష్ణ మాట్లాడుతూ మా వద్ద విక్రమ్ సోలార్, వారీ సోలార్, టాటా పవర్ సోలార్,అదానీ సోలార్ కంపెనీలు అదుబాటులో ఉంటాయని తెలిపారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతులు మీదుగా ఈ రోజు ప్రారంభించారని, సుమారు 20 యూనిట్లకు ఈరోజు రిజిస్టేషన్ చేశామని తెలిపారు. ప్రజలు సోలార్ పై అవగాహన పెంచుకోవాలని మా వ్యాపార అభివృద్ధికి పాల్పడాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ చిన్న పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ములు కన్నబాబు, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, మూది నారాయణస్వామి, ఏలేశ్వరం, లింగంపర్తి సొసైటీ అధ్యక్షులు సూతి బూరయ్య, పెంటకోట మోహన్,నాయకులు అలమండ చలమయ్య బొధిరెడ్డి గోపి,డాక్టర్ సఖిరెడ్డి విజయ బాబు, పసల సూరిబాబు, సూతి బాబులు, దనేకుల భద్రం, బొస్సా ప్రసాద్, మైరాల కనకారావు, రుచి రమేష్, బుద్ధ సూర్య ప్రకాశ్, పలివెల శ్రీనివాస్, పెంటకోట శ్రీదర్,అవసరాల సూర్య ప్రకాష్ రావు, గట్టెం వెంకటరమణ, గంగిరెడ్ల మణికంఠ, మాగాపు,వీరబాబు నూకతాటి ఈశ్వరుడు, , తదితరులు పాల్గొన్నారు..

# ఉపాధ్యాయ భవన నిర్మాణంపై ఎమ్మెల్యే అమిలినేని హామీ..!



**కుందుర్పి సెప్టెంబర్ 26, మనం న్యూస్ :** ఉపాధ్యాయ భవన నిర్మాణం పైన కళ్యాణ దుర్గం ఎమ్మెల్యే, అమిలినేని, సురేంద్రబాబు ఉపాధ్యాయులుకు హామీ ఇచ్చారు. మండల కేంద్రమైన కుందుర్పిలో గ్రామదేవత హరితగిరి ప్రదర్శనకు హాజరై తిరిగి వెళ్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని ,సురేంద్రబాబు వారిని అప్పిలేపల్లి గ్రామ సమీపంలో శనివారం ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా కళ్యాణదుర్గంలో ఉపాధ్యాయ భవన నిర్మాణం, అలాగే మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వారితో చర్చించారు.

ఉపాధ్యాయ భవనానికి సంబంధించి ఆర్డీవో అధికారి వసంత బాబుతో కలిసి స్థలాన్ని ఎంపిక చేస్తే, త్వరితగతిన భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వారు హామీ ఇచ్చారు.ఈ ఎమ్మెల్యే వారి హామీపై ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సి, తిమ్మప్ప,బొమ్మయ్య, రవికుమార్, ఉపేంద్ర,, శీనా, రేవన్న, రాజా, లోకేష్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలకు, ప్రజలకు నిరంతరం అండగా ఉంటా

**కిర్లంపూడి సెప్టెంబర్ 26:( మనం న్యూస్ ):** కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ మండలంలోని తామరాడ గ్రామంలో విస్తృతంగా పర్యటించి, పలు బాధిత కుటుంబాలను నేరుగా కలిసి పరామర్శించారు. గ్రామంలో ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న గంధం ఫకీర్, అదేవిధంగా గుండె సర్జరీ చేయించుకున్న గంధం విష్ణు భార్యను కలిసి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైన తుంగపల్లి శివను, లారీ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కోలుకుంటున్న టీడీపీ సీనియర్ కార్యకర్త ఎలుగుబంటి శ్రీనును పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. ఈ పర్యటనలో తామరాడ మాజీ సర్పంచ్, జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అనుకూల శ్రీకాంత్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి నీలం శ్రీనుతో పాటు పలువురు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో ఘనంగా పోషకాహార మహోత్సవాలు



**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 26మనం న్యూస్:** ప్రత్తిపాడులో అంగన్వాడీ కేంద్రం-8లో పోషకాహార మహోత్సవాలు,అంగన్వాడీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి టిడిఆర్ పద్మావతి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు,గర్భిణీలు,బాలింతలకు అందుతున్న వివిధ సేవలను వివరించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారం,ఆరోగ్య సేవలు,ఇతర సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లులు,గర్భిణీలు,బాలింతలకు సూచించారు.అనంతరం అంగన్వాడీ కార్యకర్తలను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సింగిలిదేవి సత్తిరాజు,వెలుగుల నాని, ముత్యాల రాంబాబు,మదినే దొరబాబు,చిలకమర్తి వీరభద్రరావు,మదినే బాబ్జి,బొబ్బర ప్రసాద్,సూపర్వైజర్ ఎన్ వరలక్ష్మి,అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు,తల్లులు,తదితరులు పాల్గొన్నారు.



# యర్రవరం అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్య ఉత్సవం

**ఏలేశ్వరం,సెప్టెంబర్, 26:-(మనం న్యూస్):** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం కొత్త యర్రవరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి ఉత్సవం నిర్వహించారు. సీడీపీవో టిడిఆర్ పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు బస్సా మహాలక్ష్మి ప్రసాద్, మైరాల కనకరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులతో సీడీపీవో పద్మావతి ఆప్యాయంగా ముచ్చటించి మిఠాయిలు పంపిణీ చేశారు.చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు.



# ముదునూరికి పితృవియోగం..

## ఫోన్లో పరామర్శించిన వైఎస్ జగన్

**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 26 మనం న్యూస్:** నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజుకు పితృవియోగానికి గురయ్యారు.మండలంలోని ధర్మవరంలో నివాసముంటున్న

మురళీ కృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు (87) శనివారం ఉదయం అస్వస్థతకు గురై ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందారు.ఆయనకు ట్రస్ట్ వైస్ చైర్మన్ ముదునూరి సీతారామరాజు,మురళీ కృష్ణంరాజుతో పాటు ఐదుగురు కుమార్తెలు సంతానం.రామరాజు మృతి విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి మురళీకృష్ణరాజుకు ఫోన్లో పరామర్శించారు.తండ్రి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.మురళీ కృష్ణంరాజుకు రామరాజు ఆరోగ్యం,మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు.




# ఖాద్రీశుని దర్శనార్ధము విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు

**కదిరి, సెప్టెంబర్26మనంన్యూస్:** ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శహించుకొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ రెడ్డి, న్యామూర్తి జస్టిస్ గురురంజన్, న్యాయమూర్తి జస్టిస్ బానుమతిను ఆలయ తూర్పు రాజగోపురము ముందు పూర్ణకుంభం స్వాగతముతో అర్చకులు పలకడమైనది. ఆలయ ప్రదక్షణ చేసినంతరము స్వామి, అమ్మ వార్ల ఆలయములో ప్రత్యేక పూజ జరిపించడమైనది. దర్శనము అనంతరము స్వామి వారి చిత్ర పట్టము, శేషవస్త్రములతో పాటు ప్రసాదములను సమర్పించడమైనది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసులురెడ్డి, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

# వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి



**శంఖవరం సెప్టెంబర్ 26 మనం ప్రతినిధి:** సమగ్ర శిక్ష జిల్లా అదనపు సమన్వయకర్త వి.వి.వి. సత్యనారాయణ శంఖవరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్, పదో తరగతి, ఆరో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రగతి పత్రాలను, తొలిదశ అభ్యసన మూల్యాంకనం, ఏకక పరీక్షల మార్కులను పరిశీలించారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కష్టపడి చదవాలని సూచించారు. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అనంతరం వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజన పట్టికను పరిశీలించి, భోజనాన్ని రుచి చూశారు. భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.



# రోడ్డు నిర్మించండి – బాధలు తీర్చండి మహాప్రభో

**కాత్రేనికోన సెప్టెంబర్ 26 మనం ప్రతినిధి:** మండలం లోని పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో ని ఐ చెరువు నుండి దాసరివారిపేట వరకు రోడ్ పరిస్థితిచాలా దారుణం గా ఇంకా ప్రమాదకారం గా మారిన ఎవరు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం అధికారులు కనీసం పట్టించుకోకపోవడం తో అనేక సంవత్సరాలనుండి నిర్మాణం చేయలేదని ఈ రోడ్డు మీదుగా గెడ్డాది వారి పేట, దాసరి వారి పేటకు వెళ్లే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని .స్కూల్ కి వెళ్లే పిల్లలు చాలా ఇబ్బందులు పడటం ప్రమాదం జరిగితే అంబు లెన్స్ కూడా రావడానికి లేని విధంగా రోడ్డు ఉందని .కావున అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలం లో చాలా గ్రామాలలో రోడ్లు వేస్తున్నట్లు గానే మా గ్రామానికి రోడ్డు వేయాలని . గుత్తాల ప్రసాదరావు,

పెట్ట రాజీవ్, పెట్ట త్రిమూర్తులు, గెద్దాడి గోవిందురాజు, గెద్దాడివి వి సత్యనారాయణ,గెడ్డది యస్వంత్, గెద్దాడి వెంకటేశ్వరరావు, గుత్తల బాలు, దాసరి సంపత్ రావు, ఉండ్రు లోవరాజు, మోరంపూడి దనశేఖర్ తదితరులు కోరుతున్నారు




# మత్తు మాఫియాపై మౌనం వీడండి..!

**శంఖవరం, సెప్టెంబర్ 26 (మన ప్రతినిధి):** మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు మౌనంగా ఉండకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఈగిల్ బృందం సభ్యులు సూచించారు.

శంఖవరం మండలం కత్తిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఈగిల్ బృందం ఆధ్వర్యంలో మౌనం వీడండి.. మాదకద్రవ్యాలపై గళమెత్తండి అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు, కుటుంబ జీవితం తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

మనం Manam



## కాలం ఒకేలా వుండదు

నిన్ను నడిపే కాలం నువ్వు నడిచే కాలం
మన కళ్ల ముందు క్షణాలు క్షణాలుగా
కదిలిపోయే కాలం కరిగి పోయే కాలం
ఇప్పుడు ఎప్పుడు ఎల్లప్పుడూ....
ఒకేలా వుండదు..ఒక్కరి కోసం వుండదు
కాలం మనదేలే అనుకుంటే పొరపాటే
కాలం వెంట మనం నడుస్తుంటాం
మన వెంట కాల మెప్పుడూ నడవదు
మనలా అస్సలు నడవదు
మన కోసం కూడా నడవదు

ఈ రోజు వున్నట్టే
రేపు కూడా వుండదు కాక వుండదు
రేపన్నది ఎప్పుడూ ఓ అస్పష్ట చిత్రం
వర్తమానంలోకి వచ్చే వరకూ
అది ఒఠి ఊహ
ఈ రోజు నువ్వు నిలబడ్డట్టే
రేపూ నిలబడతానని అనుకోకు
కాలపు తులాభారంలో
నువ్వు ప్రతీ సెకనూ తూచబడతావు
నీ చిత్తశుద్ధి పనులే
నీ గెలుపుకు గీటురాయి
భూమ్మీది నువ్వు
ఆకాశంలోకి ఎగరటం
ఆకాశం నుంచి రెప్పపాటులో
భూమ్మీదికి పడిపోవటం
వికృతమూ కాదు వింతేమీ కాదు

నాయకుడా....ప్రజా తీర్పు పదిలం
మాటల గారడీలు మూట గట్టుకో
కాలం గీసే గీతల్ని
నువ్వెప్పుడూ కాలిక్యులేట్ చేయలేవు
కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు
ఎల్ నినొకు ఎండిపోవచ్చు
వర్షానికి నిండా తడిచిపోనూ వచ్చు
కాలంతో ప్రయాణం చెయ్ అంతే..
నీ విజయం కాలమున్నంతకాలం
నిలువెత్తు నిలుస్తుందను కోకు
కాలం నువ్వెక్కిన బుల్లెట్టు బండి కాదు
కాలంపై స్వారీ కుదరదుకాక కుదరదు
కాలం నిన్ను తుడిచేయక ముందే
కాలంతో సఖ్యతగా వుండు
గుర్తుపెట్టుకో..
కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు..!

**- డా.కటుకోర్ఘ్వల రమేష్**
9949083327

# నదీ ప్రదేశాలను ఆక్రమిస్తే మూల్యం తప్పదు

ప్రపంచ నదుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నాల్గవ ఆదివారం (ఈసారి సెప్టెంబర్ 27వ తేదీ) నిర్వహిస్తారు. జీవావరణ వ్యవస్థలు, వ్యవసాయం, మానవ నాగరికతల మనుగడలో నదుల ప్రాముఖ్యతను గుర్తించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. మన నదులను కాపాడుదాం - మన భవిష్యత్తును భద్రపరుద్దాం. నదులు తాగునీరు, సాగునీరు, పరిశ్రమలు ఇతర దైనందిన అవసరాలకు అవసరమైన నీటిని అందిస్తాయి. ఇవి అనేక జలచర, భూచర జీవావరణ వ్యవస్థలకు ఆవాసాలుగా ఉండటంతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయి. కాలుష్యం, అధిక నీటి వినియోగం, నదీ పరివాహక ప్రాంతాల ఆక్రమణలు వాతావరణ మార్పుల వల్ల నదులు ఎదుర్కొంటున్న ముప్పులపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం లక్ష్యం. నదుల శుభ్రత, సంరక్షణ కార్యక్రమాల్లో ప్రజలు స్థానిక సమాజాలు చురుకుగా పాల్గొనాలి. భవిష్యత్ తరాలకు నీటి భద్రతతో పాటు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే నదులను నేడు పరిరక్షించడం అత్యంత అవసరం. ప్రపంచ నదుల దినోత్సవం పరిశుభ్రమైన, నిరంతరం ప్రవహించే నదులు సుస్థిరమైన మరియు సమృద్ధమైన భవిష్యత్తుకు ఎంతో కీలకమని మనకు గుర్తుచేస్తుంది. ప్రపంచ నదుల దినోత్సవం 2026 అధికారిక ఇతివృత్తం అడవులు లేకపోతే నదులు లేవు, నదులు లేకపోతే నీరు లేదు, నీరు లేకపోతే జీవం లేదు.

నదీ ప్రవాహ ప్రాంతాలు, వరద మైదానాలు ప్రధానంగా వేగవంతమైన పట్టణీకరణ, వాణిజ్య భవనాల నిర్మాణం, వ్యవసాయ విస్తరణ, రహదారులు, వంతెనల అభివృద్ధి, పారిశ్రామిక కార్యకలాపాలు, ఘన వ్యర్థాల అక్రమ పారవేత, ఇసుక తవ్వకాలు, భూమిని మట్టితో నింపడం, నదీతీర వృక్ష సంపద తొలగింపు, అనధికారిక నివాసాల ఏర్పాటు వంటి కారణాల వల్ల క్రమంగా తగ్గిపోతున్నాయి. నదీ ప్రాంతాల ఆక్రమణ వల్ల సహజ నదీ ప్రవాహ మార్గం ఇరుకుగా మారింది. ఫలితంగా నది నీటిని మోయగల సామర్థ్యం తగ్గి, వరదలు మరింత తరచుగా తీవ్రంగా సంభవించే ప్రమాదం పెరుగుతుంది. అంతే కాకుండా, సహజ నీటి పారుదల వ్యవస్థకు ఆటంకం ఏర్పడి, నదీ తీరాల కోత పెరగడంతో పాటు సమీప ప్రాంతాల్లో నీరు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. భవనాల నిర్మాణం, కాంక్రీటీకరణ వల్ల భూగర్భ జలాల పునర్భరణ తగ్గి, చిత్తడి నేలలు, జలచర జీవావాసాలు దెబ్బతింటాయి. గృహ మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, ఘన వ్యర్థాల వల్ల నీటి కాలుష్యం పెరిగి, నీటి నాణ్యత తగ్గడంతో పాటు జీవ వైవిధ్యానికి ముప్పు ఏర్పడుతుంది. 2026లో నిర్వహించిన ఒక ప్రపంచ అధ్యయనం 7.52 మిలియన్ కిలోమీటర్ల నదీ తీర ప్రాంతాలను మ్యాప్ చేయగా, వాటిలో దాదాపు 20% మానవ కార్యకలాపాల వల్ల మార్పులకు గురైనట్లు గుర్తించింది. ఇందులో 13.43% వ్యవసాయ కార్యకలాపాల ప్రభావానికి, 6.29% నిర్మిత ప్రాంతాల ప్రభావానికి గురయ్యాయి. మరో ప్రపంచ స్థాయి అధ్యయనం 520 ప్రధాన నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించి, 1992-2019 మధ్య సుమారు 6,00,000 చదరపు కిలోమీటర్ల సహజ వరద మైదానాలు ఇతర అవసరాలకు మార్చబడినట్లు అంచనా వేసింది. ఇందులో సుమారు 4,60,000 చదరపు కిలోమీటర్లు వ్యవసాయానికి, 1,40,000 చదరపు కిలోమీటర్లు అభివృద్ధి చెందిన ప్రాంతాలకు మార్చబడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా 100 సంవత్సరాల వరద మైదానాల్లో పట్టణ ప్రాంతాల విస్తీర్ణం 1985లో 16,443 చదరపు కిలోమీటర్ల నుంచి 2018లో 92,233 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అంటే నాలుగు రెట్లకు పైగా పెరుగుదల నమోదైంది. ఈ కాలంలో ప్రపంచ పట్టణ విస్తరణలో 12.6% వరద మైదానాల్లోనే జరిగింది.



భారతదేశంలో, ముఖ్యంగా వేగంగా పట్టణీకరణ జరుగుతున్న ప్రాంతాల్లో, నదీ ప్రాంతాల ఆక్రమణ ఒక ప్రధాన పర్యావరణ సమస్యగా మారింది. భారతదేశంలో నిర్వహించిన మొదటి నీటి వనరుల గణన ప్రకారం దేశవ్యాప్తంగా 24,24,540 నీటి వనరులు గుర్తించబడ్డాయి. వీటిలో 38,496 (సుమారు 1.59%) నీటి వనరులు ఆక్రమణకు గురైనట్లు నమోదయ్యాయి. రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో 15,301, తమిళనాడులో 8,366, ఆంధ్రప్రదేశ్‌లో 3,920, తెలంగాణలో 3,032 నీటి వనరులు ఆక్రమణకు గురైనట్లు నమోదయ్యాయి. Central Water Commission అధ్యయనం ప్రకారం 1986-2022 మధ్య సుమారు 21 మిలియన్ హెక్టార్ల ప్రాంతం వరదల ప్రభావానికి గురైంది. 2024 కేంద్ర జల సంఘం (CWC) అంచనా ప్రకారం, భారతదేశ నదీ పరివాహక ప్రాంతాల సగటు వార్షిక నీటి లభ్యత సుమారు 2,115.95 బిలియన్ ఘన మీటర్లు (BCM)గా ఉంది. 2025 CPCB నివేదిక ప్రకారం 271 నదులపై 296 కాలుష్యానికి గురైన నదీ ప్రాంతాలు గుర్తించబడ్డాయి, అయితే 2018లోని 351తో పోలిస్తే ఇది తగ్గింది.

2025లో భారతదేశంలో భూగర్భజలాల వార్షిక పునర్భరణ 448.52 బిలియన్ ఘన మీటర్లు (BCM)గా, వార్షికంగా వినియోగించదగిన భూగర్భజల వనరు 407.75 బిలియన్ ఘన మీటర్లు గా, భూగర్భజలాల వార్షిక వెలికితీత 247.22 బిలియన్ ఘన మీటర్లు గా అంచనా వేయబడింది. మరోవైపు నదుల్లో సేంద్రియ కాలుష్యం పెరగడం వల్ల జీవరసాయన ఆక్సిజన్ డిమాండ్ పెరిగి, నీటిలో కరిగిన ఆక్సిజన్ తగ్గుతుంది. నదీ కాలుష్యం తాగునీటి శుద్ధి ఖర్చులను పెంచి, నీటి వినియోగయోగ్యతను తగ్గిస్తుంది. ఇది చేపల వనరులు, జలచర జీవవైవిధ్యం మరియు నదులపై ఆధారపడే జీవనోపాధులను కూడా ప్రభావితం చేస్తుంది. కాలుష్యంతో వ్యవసాయానికి ఉపయోగించే నీటి నాణ్యత తగ్గి, దీర్ఘకాలంలో నేల మరియు ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే 2018లోని 351 కాలుష్యిత నదీ ప్రాంతాలతో పోలిస్తే 2025లో ఈ సంఖ్య 296కి తగ్గింది, అలాగే 71 ప్రాంతాల్లో నీటి నాణ్యత మెరుగుపడింది.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు నదుల సుస్థిరతను మెరుగుపరచడానికి సమగ్ర నదీ పరీవాహక ప్రాంత నిర్వహణ, మురుగునీటి శుద్ధి, వరద మైదానాల పరిరక్షణ, పర్యావరణ ప్రవాహాల నిర్వహణ, చిత్తడి నేలల పునరుద్ధరణ, అడవుల పెంపకం వంటి చర్యలను అమలు చేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ వాటర్ ఫ్రేమ్‌వర్క్ డైరెక్టివ్ నదీ పరీవాహక ప్రాంతాల స్థాయిలో నిర్వహణ , కాలుష్య నియంత్రణ ద్వారా నదుల మంచి పర్యావరణ, రసాయన స్థితిని సాధించడాన్ని ప్రోత్సహిస్తుంది.

అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్యసమితి ప్రకృతి ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహిస్తోంది. వీటిలో చిత్తడి నేలల పునరుద్ధరణ, నదీ పరివాహక ప్రాంతాల పరిరక్షణ, మంచినీటి జీవావరణ వ్యవస్థల సంరక్షణ ముఖ్యమైనవి. ఈ చర్యలు వరద నియంత్రణ, నీటి నిల్వ, జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడంలో సహాయపడతాయి.

భారతదేశంలో నమామి గంగే కార్యక్రమం.. నదీ కాలుష్య నియంత్రణ, గంగా నది పునరుజ్జీవనంపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమంలో మురుగునీటి శుద్ధి, నది ఉపరితల శుభ్రత, జీవ వైవిధ్య పరిరక్షణ, అడవుల పెంపకం, పారిశ్రామిక వ్యర్థాల పర్యవేక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలు ఉన్నాయి. గంగా నదిలో నిరంతరమైన, కాలుష్యరహిత నీటి ప్రవాహాన్ని కొనసాగించడం, నది పర్యావరణ సమగ్రతను పరిరక్షించడం కూడా దీని ముఖ్య లక్ష్యాలలో భాగం. భారతదేశం నీటి వినియోగ అవసరాలను పర్యావరణ అవసరాలతో సమతుల్యం చేయడానికి నదీ పరివాహక ప్రాంత నిర్వహణ ప్రణాళికలను ప్రోత్సహిస్తోంది. అదనంగా, వరద మైదానాల పరిరక్షణ, క్యాచ్మెంట్ ప్రాంతాల అభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ మరియు జలచర జీవ వైవిధ్య పునరుద్ధరణ వంటి చర్యలు చేపడుతున్నారు.

నదుల పరిరక్షణకు ప్రభుత్వం, స్థానిక సమాజాలు, పర్యావరణ సంస్థలు కలిసి పనిచేసే సమగ్ర విధానం అవసరం. ఆక్రమణలను నివారించడానికి నదీ సరిహద్దులు, వరద రేఖలు, రక్షిత బఫర్ ప్రాంతాలను స్పష్టంగా గుర్తించాలి. గృహ మురుగునీటిని నదుల్లోకి విడుదల చేసే ముందు తప్పనిసరిగా శుద్ధి చేయాలి. పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించడానికి పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థజలాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, పర్యావరణ ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. జలచర జీవావరణ వ్యవస్థలు, భూగర్భ జలాల పునర్భరణ, దిగువ ప్రాంతాల్లో నివసించే సమాజాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన పర్యావరణ ప్రవాహం కొనసాగించాలి. వరదలు, నదీ తీరాల కోత జీవావాసాల నష్టాన్ని తగ్గించడానికి చిత్తడి నేలలు, వరద మైదానాలు, నదీతీర వృక్ష సంపదను పునరుద్ధరించాలి.

శాస్త్రీయ అంచనాలు, సమర్థవంతమైన పర్యవేక్షణ ద్వారా అనియంత్రిత ఇసుక తవ్వకాలు, నదీ గర్భంలో మార్పులను నియంత్రించాలి. ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలు నదుల్లోకి చేరకుండా సమర్థవంతమైన వ్యర్థ నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. నదుల్లోకి మట్టి కొట్టుకుపోవడం, పూడిక పేరుకుపోవడాన్ని తగ్గించేందుకు క్యాచ్మెంట్ ప్రాంతాల అభివృద్ధి, అడవుల పెంపకం నేల సంరక్షణ చర్యలను ప్రోత్సహించాలి. తొమ్మిదవది, భౌగోళిక సమాచార వ్యవస్థ మరియు డ్రోన్లను ఉపయోగించి సమగ్ర నదీ పరీవాహక ప్రాంత నిర్వహణ చేపట్టడం ద్వారా ఆక్రమణలు, కాలుష్యం నదీ ప్రవాహంలో మార్పులను సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చు. ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ విద్య, నదీ శుభ్రత కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలి. ఈ చర్యలన్నింటినీ సమన్వయం చేస్తూ పరిరక్షించు - నిరోధించు - పునరుద్ధరించు- పర్యవేక్షించు (Protect&Prevent&Restore&Monitor) అనే విధానాన్ని అమలు చేయడం ద్వారా సుస్థిర నదీ నిర్వహణకు తోడ్పడవచ్చు.

**- కిరణ్‌శ్రీ**
8125695799

# 'దిక్సూచి' తెలంగాణ సాహితి దశాబ్ది సంచిక



మనకు గుర్తుండే ఉంటుంది. ఏడాది గడిచి పోతుంటే పత్రికలు అన్ని రంగాలలో వృద్ధిని కొలిచినట్లే సృజన శీలుల తీరుతెన్నెలను నిష్ణాతుల ద్వారా ఆ ఏడాది సృజించిన సాహిత్య సంపదను పత్రికలు అంచనా వేయించేవి. ముఖ్యమైన కవితా సంపుటాలు, నవలలు, కథలు విమర్శ, నాటకం మొదలైన అన్ని ప్రక్రియల మీద ఒక అవగాహన కలిగించే ప్రయత్నం చేసేవి. కొన్ని కొన్ని సందర్భాలలో దీపావళి వంటి ప్రత్యేక సంచికలు వెలువరించేవి అప్పటి కవులు సాహిత్యాభిమానులు వాటిని విలువైన సంపదగా భద్రపరుచుకునేవారు.

స్వరాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచిపోయింది. స్వీయ పాలనలో సాహిత్య పరంగా మనం చేసిన కృషి ఏమిటనే ప్రశ్నకు నిలువుటద్దంగా నిలిచే ప్రత్యేక సంచిక తెలంగాణ సాహితీ దశాబ్ది సాహిత్య ప్రత్యేక సంచిక. తెలంగాణ సాహితి గురించి సాహిత్య ప్రియులకు పెద్దగా పరిచయం చేయనక్కరలేని క్రియాశీలమైన సాహిత్య వేదిక.ప్రతి సందర్భంలో కవులను, కళాకారులను, రచయితలను దిశా నిర్దేశం చేయటంలో తన వంతు కృషి తాను చేస్తూనే ఉంది.

ఇందులో ఈ 10 ఏళ్లలో తెలుగు సాహిత్యంలో కృషిచేసి,భాషకు ఎన్నో సేవలు అందించి పరమపదించిన దాదాపు 50 మంది సాహిత్య మూర్తుల స్ఫూర్తి వ్యాసాలను ప్రముఖ రచయితల చేత రాయించడం ఆ మహానుభావు లకు చెల్లించిన ఘన నివాళి.

తెలంగాణ సాహితికి ఎన్నో సేవలు అందించిన తంగిరాల చక్రవర్తి, విమర్శ రంగంలో దారి దీపమైన కేకేఆర్, యుద్ధ నౌక గద్దర్, పాటకు ప్రాణం పోసిన గూడ అంజయ్య, విమర్శకు పాఠ్యపుస్తకమైన పరిశోధనా గ్రంథాన్ని అందించిన ఎస్వీ రామారావు వంటి ప్రముఖులపై




ఆలోచించదగ్గ వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

అట్లాగే వర్తమాన సుప్రసిద్ధ కవులు డాక్టర్ అప్సర్, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జూపాక సుభద్ర,గోరటి వెంకన్న, డాక్టర్ అమృతలత, డాక్టర్ యాకూబ్, మోత్కూరి నరహరి, జూకంటి జగన్నాథం, ఇలాంటి ప్రముఖులతో ముఖాముఖి జరిపి వర్తమాన సాహిత్య మూల్యాంకనం చేయడం జరిగింది. ఇవాళ కవిత్వం రాస్తున్న సుప్రసిద్ధ కవులు 81 మంది కవితలు మనకు నేటి సాహిత్య సొగసును, చైతన్యాన్ని కళ్ళకు చిత్రికను పడతాయి.

530 పేజీలున్న ఈ ప్రత్యేక సంచికకు సంపాదకులుగా ఉన్న రచయిత, కవి కె.ఆనందాచారి సంపాదకీయం రాస్తూ 'ఈ దశాబ్ద కాలం పెద్దది ఏమీ కాదు. కానీ మన సాహిత్య రంగం నడక దిశ ఎట్లా ఉందో తెలుసుకునేందుకు ఈ పదేళ్ల కాలం సరిపోతుందని' అంచనా వేశారు. మన రచయితల, కవుల దృక్పథం ఏంటో అర్థం చేసుకోవచ్చు. భవిష్యత్తులో ఇంకా ఏం చేయాలో మనం అంచనాలు వేసుకొని ముందుకు సాగవచ్చు. ఈ సంచికలో మరో సుప్రసిద్ధ సంపాదకులు, విశ్లేషకులు తెలకపల్లి రవి చేసిన విశ్లేషణ దశాబ్ది ఉత్సాహంతో విశాల ప్రజాస్వామ్య వేదికగా తెలంగాణ సాహితి ఎదగాలని రాసిన వ్యాసం అందరం చదవ తగినది.

దళిత, బహుజన, బీసీవాద, స్త్రీవాద మైనారిటీ వాద, అస్థిత్వవాద కవుల కృషికి ఈ సంచిక దిక్సూచిగా నిలుస్తుంది. ఇందులో యస్. రఘు, సీతారాం, ప్రసేన్, మామిడి హరికృష్ణ, కోటేశ్వర రావు, టి ఉదయవర్లు, ఆచార్య బన్న ఐలయ్య వంటి సీనియర్ రచయితల విశ్లేషణలు యాకమ్మ వంటి వర్ధమాన రచయిత్రుల రచనలు మనల్ని భిన్నంగా ఆలోచింపచేస్తాయి. డాక్టర్ జె. చెన్నయ్య ఈ పదేళ్లు తెలంగాణ సారస్వత పరిషత్తు చేసిన కృషిని, వికాసాన్ని తన వ్యాసంలో సోదాహరణంగా వివరించారు.

డాక్టర్ ముదిగంటి సుజాతరెడ్డి, డాక్టర్. నందిని సిద్ధారెడ్డి, డాక్టర్. సి మృగాళిని అంపశయ్య నవీన్, గింజల నరసింహారెడ్డి సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కె. శ్రీనివాస్, ఏనుగు నరసింహారెడ్డి మొదలైన వ్యక్తుల ముఖా ముఖి ఇంటర్వ్యూలు సృజన కారులకు ఎంతో ఉపయోగం.

తెలంగాణ సాహిత్య దశాదిశను సూచించే ప్రసిద్ధ కవుల కవితలు 81 మనల్ని అలరింపజేస్తాయి. ఆలోచింపజేస్తాయి కూడా. ఈ సంచిక ప్రత్యేకమైనది. సంపాదకులు ఆనందచారి వారి సంపాదకవర్గం చేసిన కృషి తెలుగు సాహిత్య చరిత్ర భద్రపరచుకొని గుర్తుపెట్టుకుంటుంది. సంపాదకులకు,వారి వర్గానికి అభినందనలు.

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

# సామాన్యుడి నెత్తిన 'ఎండీఆర్'! పిడుగు




పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అనే తీరుగా విశ్వగురు 'భారత్' అంటూ ఓ వైపు ప్రచారం.. మరోవైపు సొంత దేశ ప్రజలపైనే ఎండీఆర్ పేరిట వసూళ్లు చేసే దిశగా భారత్ అడుగులు పడుతున్నాయి. 2016లో నోట్ల రద్దు నిర్ణయంతో ప్రజలకు కలిగిన అసౌకర్యం గురించి మాటల్లో చెప్పలేం. దేశంలోని ప్రజలంతా రూ.1,000, 2 వేలకు క్యూ లైన్లలో నిలబడి పడరాని పాట్లు పడిన ఉదంతాలు బోలెడు. ఆ సమయంలో'డిజిటల్' లావాదేవీలను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర సర్కారు ప్రకటించింది. 'డిజిటల్ ఇండియా'కు ప్రతీకగా ప్రపంచానికి భారత్ చూపించిన డిజిటల్ నమూనాగా యూపీఐని ప్రస్తావించారు. ప్రజలకు యూపీఐని అలవాటు చేసి ఇప్పుడు చార్జీలు వేయడానికి సిద్ధమయ్యారు.

బ్రిటీష్ వారు భారతదేశంలో 'టీ' రుచి ప్రజలకు పరిచయం చేయడానికి దానిని బహిరంగ ప్రదేశాలు మార్కెట్లు, రైల్వే స్టేషన్లు తదితర వాటిల్లో తొలుత ఉచితంగా అందించేవారట. క్రమంగా అది అలవాటుగా మారిపోయింది. ఈ అలవాటును ఆసరా చేసుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలుత డిజిటల్ లావాదేవీలు చేయాలని 'డిజిటల్ భారత్' అంటూ ఆర్భాటం చేసి.. యూపీఐ చెల్లింపులను విస్తృతంగా ప్రోత్సహించి ఇప్పుడు చార్జీలు విధిస్తూ సాధారణ ప్రజలపై ఆర్థిక భారం మోపేందుకు సిద్ధమైంది.

తాజా ఎన్పీసీఐ ప్రకటన ప్రకారం.. అక్టోబర్ 15, 2026 నుంచి అర్హత కలిగిన వ్యాపారులకు రూ.2 వేలకు మించి యూపీఐ పర్సన్ టు మర్చంట్ లావాదేవీలపై0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమలులోకి రానుంది. ఒక్కో లావాదేవీపై గరిష్టంగా రూ.300 పరిమితి విధించడంతో పాటు కొన్ని ప్రత్యేక రంగాలకు వేరే ఫీజు నిర్మాణం ఉండనుంది. 'వినియోగదారుడిపై నేరుగా చార్జీ లేదు' అని ప్రభుత్వం వాదించొచ్చు. కానీ, యూపీఐ యాప్‌లో అదనపు చార్జీలను వ్యాపారి వస్తువు ధరలో కలిపితే వినియోగదారుడి ఖర్చులోనే అది పడుతుంది. ఇలా చార్జీల భారం మోపడం వల్ల ప్రజలు మళ్లీ నగదుపైన ఆధారపడాల్సి వస్తుంది. ఫలితంగా డిజిటల్ లావాదేవీలు మందగిస్తాయి. దాంతో మళ్లీ భౌతిక నగదు డిమాండ్ పెరిగి.. ముద్రణపైన ఖర్చు చేయాల్సి ఉంటుంది. దేశంలో ఉచిత యూపీఐ సేవలుండటం వల్ల తమ వ్యాపారం దెబ్బ తింటున్నదని అమెరికాకు చెందిన వీసా, మాస్టర్ కార్డు వంటి బడా సంస్థలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గి భారతదేశం వారికి అనుకూలంగా చార్జీలు విధిస్తున్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎండీఆర్ చార్జీల వల్ల అమెరికా కంపెనీలకు ప్రయోజనాలు చేకూరనున్న నేపథ్యంలో ప్రజాకోణంలో ఆలోచనచేసి'ఉచిత యూపీఐ'ని భారత ప్రభుత్వం కొనసాగించాలి. రూ. వేల కోట్లు ఎన్నో ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు కేటాయించే భారత ప్రభుత్వం సుమారు రూ.2,200 కోట్లు యూపీఐ నిర్వహణకు ఖర్చు చేయడం ద్వారా సామాన్యులను ఆర్థిక వ్యవస్థలో భాగం చేసి వారిని బలోపేతం చేయొచ్చు. అంతేకాకుండా వారి ఆర్థిక నిర్వహణను అర్థం చేసుకునే దిశగా ఆలోచించవచ్చు. చార్జీ విధింపు నిర్ణయాన్ని ఒకవేళ కేంద్రం ఉపసంహరించుకోనట్లయితే ప్రజాగ్రహానికి కేంద్రం గురికాక తప్పదు.

**- అంబీర్ శ్రీకాంత్**
81859 68059

# రాయలసీమకు ఉద్యాన సిరులు.. రైతన్నకు ఆదాయ భరోసా

### రూ.లక్ష కోట్ల సమగ్ర పెట్టుబడుల ప్రణాళికతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'

### 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు.. 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం లక్ష్యం

### అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా ఐహెచ్డీపీ ప్రారంభం

### సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు విస్తృత ప్రజా అవగాహన కార్యక్రమాలు

### కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి ప్రజలను భాగస్వాములను చేయాలి: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, సెప్టెంబర్ 26,(మనం ప్రత్యేక ప్రతినిధి):** రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్ది, రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్-రైజింగ్ రాయలసీమ' కార్యక్రమాన్ని ప్రజాభాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సంబంధిత జిల్లా కలెక్టర్లతో మంత్రి మాట్లాడారు. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు నిర్వహించే ప్రత్యేక ప్రజా అవగాహన కార్యక్రమాలను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులకు ప్రాజెక్టు లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రాజెక్టు (ఐహెచ్డీపీ) ప్రారంభం కానుందని మంత్రి తెలిపారు. ప్రధాన కార్యక్రమంతోపాటు 201 క్లస్టర్లలో ఏకకాలంలో మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్కే)లో ప్రత్యక్ష ప్రసారం, జిల్లా కేంద్రాల్లో ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లా నుంచి ఎంపిక చేసిన ఒక మహిళా రైతు తన జిల్లా ఉద్యాన పంటలతో ప్రత్యేకంగా సిద్ధం చేసిన పండ్ల బుట్టను ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రికి సమర్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ఉద్యాన రంగాన్ని కీలకంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు ఐహెచ్డీపీ కార్యరూపమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలతోపాటు ప్రకాశం, మార్కాపురం కలిపి మొత్తం 10 జిల్లాల్లో 201 ఉద్యాన క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. తక్కువ నీటితో అధిక విలువ కలిగిన పంటల సాగు, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల వైవిధ్యం, సూక్ష్మ సేద్యం విస్తరణ, రైతులకు మెరుగైన ధరలు కల్పించడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలని చెప్పారు. నీటి వనరుల నుంచి ఎగుమతుల వరకు అన్ని వ్యవస్థలను ఒకే సమగ్ర ప్రణాళికలో అనుసంధానం చేస్తూ సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులను సమీకరించేలా ప్రాజెక్టును రూపొందించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో ప్రభుత్వ పెట్టుబడి సుమారు రూ.40,352 కోట్లు కాగా, సాగునీటి రంగానికి రూ.20,884 కోట్లు, ఉద్యాన రంగానికి రూ.14,906 కోట్లు, గ్రామీణ




రహదారులకు రూ.4,562 కోట్లు వెచ్చించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రాసెసింగ్, శీతల గొలుసు వ్యవస్థలు, ప్యాకేజింగ్, రవాణా, సరకు నిర్వహణ రంగాల్లో మరో రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తోటలను మార్కెట్లతో అనుసంధానం చేసి, పంటలకు విలువ జోడించడం ద్వారా రైతులకు మరింత ఆదాయం సమకూర్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆగస్టు 2026 నుంచి జూలై 2029 వరకు మూడు దశల్లో ప్రాజెక్టును అమలు చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. 2026-27లో త్వరితగతిన పూర్తయ్యే పనులు, వెలిగొండ మొదటి దశ, నల్లమలసాగర్లో నీటి నిల్వతో 72 క్లస్టర్లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2027-28లో ఎత్తిపోతల పథకాలు, కాలువలు, జలాశయాల అనుసంధానం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుతో మొదటి దశ సహా మొత్తం 139 క్లస్టర్లకు అభివృద్ధిని విస్తరించనున్నట్లు తెలిపారు. 2028-29లో మిగిలిన పనులను పూర్తి చేసి, ఎగుమతులకు ప్రాధాన్యమిస్తూ మొత్తం 201 క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల సాకారం..
# కూటమి ప్రభుత్వమే అండ

### చౌదరి కొత్తూరు గ్రామానికి చెందిన 17 పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేసిన మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, సెప్టెంబర్ 26: పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తూ, వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాలను అందిస్తోందని తెలిపారు. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం కుమారుడు పంచాయతీ పరిధిలోని చౌదరి కొత్తూరు గ్రామానికి చెందిన 17 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు తన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతల్లో ఒకటని పేర్కొన్నారు. గతంలో సొంత ఇల్లు, ఇంటి స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొన్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పేద కుటుంబాలకు ఇంటి స్థలం అంటే కేవలం భూమి కాదు.. వారి జీవితానికి భరోసా, వారి పిల్లల భవిష్యత్తుకు భద్రత అని మంత్రి పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## కాలువలోకి దూకి వివాహిత ఆత్మహత్య

**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 26 ( మనం న్యూస్ )** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో స్థానిక యాగర్లపల్లి 25వ వార్డుకు చెందిన నాగమణి (23) తాడేపల్లిగూడెం - ఏలూరు ప్రధాన కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. గాలింపు చర్యలు చేపట్టగా శనివారం భీమడోలు మండలం కురెళ్లగూడెం వద్ద ఆమె మృతదేహం లభ్యమైందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. మృతురాలికి నెల రోజుల క్రితమే వివాహం కావడం గమనార్హం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ఎర్ర కాలువలో తూడు తొలగింపునకు చర్యలు చేపట్టాం !

**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 26 ( మనం న్యూస్ )** ఎర్ర కాలువలో తూడు తొలగింపునకు చర్యలు చేపట్టామని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శనివారం తాడేపల్లిగూడెం మండలంలోని జగన్నాధపురంలో వర్షాలకు నీట మునిగిన వరి చేలను ఆయన పరిశీలించారు. దువ్వ వద్ద ఇప్పటికే తూడు తొలగించినట్లు వివరించారు.

ప్రకృతి వైపరీత్యాలను ఎవరూ తప్పించలేమన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచేసిందని విమర్శించారు. తినడానికి తిండి లేని పరిస్థితుల్లో రాష్ట్రం ఉందన్నారు . రైతులు మాట్లాడుతూ ముంపుకు గురైన పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని కోరారు. కూటమి నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు , ఈతకోట తాతాజీ , వ్యవసాయ అధికారులు , రైతులు పాల్గొన్నారు.

# లలితకళలు, కళాకారులకు ప్రభుత్వం, సమాజం అండగా నిలవాలి

### రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు

### జాతీయ గ్రూప్ సాంగ్స్ పోటీలు-2026 ప్రారంభం




**విశాఖపట్నం, సెప్టెంబర్ 26:** లలితకళలు, సంగీతం, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం, సమాజం మరింత ప్రోత్సాహం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు అన్నారు. కళాకారులకు తగిన అవకాశాలు, వేదికలు కల్పించడంతో పాటు వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కళలను కాపాడటం అంటే భారతీయ సంస్కృతిని కాపాడటమేనని పేర్కొన్నారు. భారత్ వికాస్ పరిషత్-విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రూప్ సాంగ్స్ పోటీలు-2026ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వరాలు కలిస్తే సంగీతం హృదయాలు కలిస్తే సమైక్యత మనసులు కలిస్తే భారతదేశం అని అన్నారు. గ్రూప్ సాంగ్ కేవలం సంగీత పోటీ కాదని, యువతలో సమిష్టి భావన, క్రమశిక్షణ, సహకారం, సమన్వయం, నాయకత్వ లక్షణాలు, పరస్పర గౌరవం పెంపొందించేందుకు దోహదపడుతుందని పి.ఎస్. నాయుడు తెలిపారు. ఒకే తాళం, లయ, భావంతో పలువురు కలిసి పాడినప్పుడు అద్భుతమైన సంగీతం ఆవిష్కృతమవుతుందని, ఇదే స్ఫూర్తి సమాజ నిర్మాణంలోనూ అవసరమని అన్నారు.

**సంగీతంతో సమైక్యతకు బలం**

సంగీతం భాష, ప్రాంతం, సంస్కృతులకు అతీతంగా ప్రజలను కలుపుతుందని ఆయన పేర్కొన్నారు.

పాట కేవలం వినోద సాధనం కాదని, అది సందేశాన్ని, సంస్కృతిని, భావోద్వేగాన్ని, జాతీయ చైతన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే శక్తివంతమైన మాధ్యమమని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో దేశభక్తి గీతాలు ప్రజల్లో జాతీయ భావన, ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. నేటి యువత కూడా సంగీతం, కళల ద్వారా దేశభక్తి, సామాజిక బాధ్యత, మానవీయ విలువలను సమాజంలో పెంపొందించాలని పిలుపునిచ్చారు.

## విస్తరణ భూములు పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** తాడేపల్లిగూడెంలో ఏపీ ఎన్ఐటి విస్తరణకు అవసరమైన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ కె.ఆర్. శనివారం పరిశీలించారు. రెవెన్యూ, ఎన్ఐటి అధికారులతో కలిసి జాయింట్ ఇనస్పెక్షన్ చేశారు. ఎన్ఐటి పడమర వైపు ఉన్న భూమిని చూశారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఏపీ ఎన్ఐటి కి వెళ్లే దారిలో కొండాలమ్మ గుడి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సమీపంలో గల భూములను సందర్శించారు. ఆర్డీవో ఎం.సూర్యారావు, తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్ లు వీటికి సంబంధించిన మ్యాపును చూపించి జాయింట్ కలెక్టర్ కు సమగ్రంగా వివరించారు. ఆమె పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్.ఐ.టి. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఇప్పుడున్న ఎన్ఐటి లోని వసతులు గురించి జాయింట్ కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జెసి కల్పశ్రీ మాట్లాడుతూ ఏపీ ఎన్ఐటిని విస్తరించేందుకు 50 ఎకరాలు భూములు కావాలని కోరారని తెలిపారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న 25 ఎకరాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ భూములు ఇవ్వడానికి గల అవకాశాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## ద్వారకా బస్ స్టేషన్లో డిజిటల్ కంప్లైంట్ కియోస్క్ ప్రారంభం

### 22వ ప్లాట్‌ఫాం పోలీస్ ఔట్ పోస్టులో ప్రారంభించిన సీపీ డా. శంఖబ్రత బాగ్చీ



**విశాఖపట్నం:మనం న్యూస్** ఏపీఎస్ఆర్టీసీ, ద్వారకా బస్ స్టేషన్, విశాఖపట్నం లో శనివారం విశాఖపట్నం పోలీస్ కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి, 22వ నెంబర్ ఫ్లాట్ఫార్మ్ వద్ద గల పోలీస్ ఔట్ పోస్టులో ₹డిజిటల్ కంప్లైంట్ కియోస్క్₹ ను ప్రారంభించారు. ఈ కియోస్క్ ద్వారా ఏ కంప్లైంట్ అయినా సరే పోలీస్ వారిచే తెలుగులో గాని, ఇంగ్లీషులో గాని, హిందీలో గాని, వాయిస్ రికార్డు ద్వారా నమోదు చేసి రశీదు ఇవ్వబడును. ఈ కంప్లైంట్లు ఎప్పటికప్పుడు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ద్వారా పరిశీలించి, బాధితులకు తగు న్యాయం చేకూర్చబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా సభాధ్యక్షులు విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి ₹ బి. అప్పలనాయుడు₹ మాట్లాడుతూ ఇలాంటి కియోస్క్ ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్ స్టేషన్ లో ఉండడం విశాఖ వాసులకు, ఉత్తరాంధ్ర వాసులకు ఒక అదృష్టమని, ఏదైనా కంప్లైంట్ పోలీస్ స్టేషన్లో ఇవ్వకుండా ఇక్కడకు వెచ్చి ఇచ్చినచో, పోలీసు కమిషనర్ వారు మరియు పోలీస్ డిపార్ట్మెంట్ వారు ఎప్పటికప్పుడు పరిశీలించుటకు అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ డిజిటల్ కంప్లైంట్ కియోస్క్ ను ఏర్పాటు చేసినందుకు గాను పోలీసు కమిషనర్ వారికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఈవీఎం గోదాముల్లో భద్రతా ప్రమాణాలపై కలెక్టర్ తనిఖీ



**విశాఖపట్నం, సెప్టెంబర్ 26:** చినగదిలి పరిధిలోని ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలను భద్రపరిచిన గోదాముల్లో భద్రతా ప్రమాణాలు, పర్యవేక్షణ ఏర్పాట్లు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే అంశాలను పరిశీలించారు. మూడు నెలలకొకసారి నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాముల పరిసరాలు, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, షట్టర్లు, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను పరిశీలించారు. గోదాముల తాళాలు, సీల్ వ్యవస్థ, రికార్డుల నిర్వహణ గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదాముల వద్ద భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# జీవీఎంసీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

### 120 వార్డుల్లో పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి.

### రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి.

### జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్.




**విశాఖపట్నం, సెప్టెంబర్ 26:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలోని 120 వార్డులకు జరగనున్న స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం ఉదయం జీవీఎంసీ అన్ని విభాగాల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న అన్ని జోన్ల జోనల్ కమిషనర్లు, సంబంధిత ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో సహాయ ఎన్నికల అధికారులు, సంబంధిత రిటర్నింగ్ అధికారులు, ఉద్యోగులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలీస్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాల పరిశీలన, ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఎన్నికల విధుల్లో అధికారుల బాధ్యతలు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, జీవీఎంసీ పరిధిలోని 120 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలను పరిశీలించి, ఓటర్ల వివరాల్లో ఎటువంటి తప్పిదాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను సరిచూసుకోవడంతో పాటు సంబంధిత రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, తగినంత వెలుతురు, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ర్యాంపులు తదితర మౌలిక సదుపాయాల లభ్యతను పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దాలని సూచించారు.

## విజయవాడలో మిషన్ కర్మయోగిపై ప్రాంతీయ సదస్సు

### 29వ తేదీన సదస్సును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబరు 26,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ప్రభుత్వ ఉద్యోగుల్లో సామర్థ్య నిర్మాణం, పరిపాలనా నైపుణ్యాల పెంపు లక్ష్యంగా మిషన్ కర్మయోగిపై దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ వర్క్షాప్ విజయవాడలో జరగనుంది. సాధనా శృంఖలా పేరిట ఈ నెల 29, 30 తేదీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో రెండు రోజుల పాటు సదస్సును నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, సంబంధిత భాగస్వాములు ఇందులో పాల్గొననున్నారు. 29తేదీన జరిగే ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభించనున్నారు. ఈ సదస్సుకు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ కూడా హాజరుకానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, మిషన్ కర్మయోగి ప్రతినిధులు కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మిషన్ కర్మయోగిలో భాగంగా ప్రభుత్వ శిక్షణ సంస్థల కెపాసిటి బిల్డింగ్, ఉద్యోగుల నైపుణ్యం పెంపు అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా సామర్థ్యాల పెంపు కోసం ఐగాట్, మిషన్ కర్మయోగి వేదిక వినియోగంపై ప్రదర్శన ఇవ్వనున్నారు. మిషన్ కర్మయోగి క్వాలిటీ ఫ్రేమ్వర్క్, కర్మయోగి కర్తవ్య కార్యక్రమం కింద వివిధ శిక్షణా సంస్థల పాలనకు సంబంధించిన ముసాయిదా ఫ్రేమ్ ఈ సదస్సులో చర్చ జరగనుంది. అంతర్రాష్ట్ర బృందాల కార్యకలాపాలు, ప్రశ్నోత్తరాల ద్వారా వివిధ రాష్ట్రాల అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకోనున్నారు.




**రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రజెంటేషన్లు**

ఈనెల 29న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. ఉదయం 10:30 గంటలకు సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. అనంతరం వివిధ అంశాలపై సాంకేతిక సమావేశాలు జరుగుతాయి. సెప్టెంబర్ 30న నిపుణుల సమావేశం, రాష్ట్రాల ప్రదర్శనలు, బృంద చర్చలతో వర్క్షాప్ ముగియనుంది. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా కాకుండా, ఆయా శాఖల పనితీరును మెరుగు పరిచే భాగస్వాములుగా ఎదగాలన్నది ఈ వర్క్షాప్ ప్రధాన సందేశం. దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులు తమ అనుభవాలను పంచుకునేందుకు, ప్రజలకు అందే సేవల నాణ్యతను పెంచే శిక్షణ పద్ధతులపై కలిసి పనిచేసేందుకు విజయవాడ వేదిక కానుంది. పరిపాలనలో సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వివిధ రాష్ట్రాల మధ్య ఉత్తమ విధానాలను పరస్పరం మార్చుకునేందుకు ఈ కార్యశాల కీలకంగా మారనుంది.


# ప్రయాణికులకు మరింత చేరువగా పోలీస్ సేవలు

### రైల్వే స్టేషన్లో ఈ-ఫిర్యాదుల కియాస్క్ ప్రారంభం




**విశాఖపట్నం, సెప్టెంబర్ 26:** పౌరులకు పోలీస్ సేవలను మరింత సులభతరం, పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు విశాఖపట్నం రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేసిన 'మీ పోలీస్.. మీ ఫ్రెండ్' డిజిటల్ ఈ-ఫిర్యాదుల కియాస్కును రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. మంచి కార్యక్రమానికి విశాఖ వేదికగా నిలిచిందన్నారు. విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు సుమారు 1.5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు పోలీస్ స్టేషన్కు వెళ్లాల్సిన అవసరం లేకుండా రైల్వే స్టేషన్లోనే కియాస్క్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కియాస్క్ ద్వారా తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో వాయిస్ ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ-ఫిర్యాదుల కియాస్కు ₹₹పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)₹₹కు అనుసంధానం చేయడం ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారంలో పారదర్శకత, కచ్చితత్వం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో ఏపీ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కేసులను ఛేదిస్తున్నారని హోంమంత్రి తెలిపారు. పారిశ్రామికంగా, పర్యాటకంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. మహిళల భద్రత విషయంలో విశాఖపట్నం ముందంజలో ఉందని పేర్కొన్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ.. విశాఖలో ఈ-ఫిర్యాదుల కియాస్క్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. డి ఆర్ఎ ఎం మాటలు ఆడుతూ రైల్వే స్టేషన్తో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కూడా ఈ-ఫిర్యాదుల కియాస్కు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పోలీస్ స్టేషన్కు వెళ్లకుండానే ప్రజలు కియాస్క్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. చదువు రాని వారు సైతం సులభంగా ఫిర్యాదు చేసేలా వాయిస్ ఆధారిత సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు.. ఇ కార్యక్రమం లో డీసీపీ లు ఏసీపీ లు సీఐ ఎస్ ఐ లు పాల్గున్నారు

## విశాఖపట్నం రైల్వే స్టేషన్లో బాలల సంక్షేమ సమన్వయ సమావేశం




**విశాఖపట్నం, 26.09.2026:** విశాఖపట్నం రైల్వే స్టేషన్లో బాలల రక్షణ, సంరక్షణ మరియు భద్రతకు సంబంధించిన అంశాలపై బాలల సంక్షేమ సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రైల్వే అధికారులు, చైల్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల రక్షణ విభాగం , చైల్ హెల్ప్లైన్-1098, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ప్రభుత్వ రైల్వే పోలీస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు ఇతర రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ ఎ. ఎం. ఉభాలే, స్టేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ, రైల్వే స్టేషన్లో బాలల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని ప్లాట్ఫారమ్లలో క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించాలని, ఆపదలో ఉన్న మరియు సంరక్షణ, రక్షణ అవసరమైన బాలలను గుర్తించి తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. చైల్ హెల్ప్లైన్-1098 సేవలపై ప్రయాణికులకు మరియు రైల్వే సిబ్బందికి విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. శ్రీ బి. హరి వెంకటరమణ, చైల్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ మాట్లాడుతూ, రైల్వే స్టేషన్లలో గుర్తించబడే బాలలను నిబంధనల ప్రకారం చైల్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచి, వారికి అవసరమైన సంరక్షణ, రక్షణ, పునరావాసం మరియు ఇతర సేవలను అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాలల యాచకత్వం వంటి సమస్యలను అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.

## మాజీ ఎంపిటిసి కోటి దైవ అలంకారం మృతి



**పాలకొల్లు, సెప్టెంబర్ 26,మనం ప్రతినిధి:** పశ్చిమగోదావరి జిల్లా వెలివెల గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు కోటి దైవ అలంకారం(57) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమారుడు కలరు. ఆయన మృతికి టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సోదరుడు కోటి రాంబాబు, టిడిపి బీసీ సెల్ నాయకులు దుమ్మేటి ఏసుదాసు, ఎంపీటీసీ కండిబోయిన నాగేశ్వరరావు, కొప్పునీడి శ్రీను, బోడపాటి పెదకాపు, గెడ్డం జయప్రకాష్, నరసింహారావు, మేడిది రాజబాబు, విపర్తి ఏడుకొండలు, సంఘ పెద్దలు సంతాపం తెలిపి అంత్యక్రియ లో పాల్గొన్నారు.

# గత ఐదేళ్ల నష్టాన్ని భర్తీ చేసుకునేలా అధిక నిధులు తీసుకువస్తున్నా

### మహిళల ఆర్థిక సాధికారతే చంద్రబాబు విజన్

### డ్వాక్రా వి ఓఏ ,వి ఓబీ ల ఆత్మీయ సమావేశంలో మంత్రి నిమ్మల



**పాలకొల్లు, సెప్టెంబర్ 26,మనం ప్రతినిధి:** వైసిపి ఐదేళ్ల పాలన ధ్వంసం , విధ్వంసం తప్ప అభివృద్ధి సున్నా. గత ఐదేళ్ల నష్టాన్ని వడ్డీతో సహా భర్తీ చేసుకునేలా పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి రాత్రింబవళ్లు నిరంతరం శ్రమిస్తూ అధిక నిధులు తీసుకు రాగలుగుతున్నానంటే నా కుటుంబ సభ్యులైన పాలకొల్లు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమేనని రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలన్నదే చంద్రబాబు విజన్ అని, ఆ దిశగా అడుగులు వేస్తూ దేశానికే ఆదర్శంగా, స్ఫూర్తిగా డ్వాక్రా సంఘాలు నిలిచాయి అన్నారు. పూలపల్లి ఎస్ ఎస్ ఎస్ కళ్యాణ మండపంలో శనివారం పాలకొల్లు పట్టణ మరియు పాలకొల్లు మండలం డ్వాక్రా వీఓఏ, వీఓబీల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు వినాయక చవితి, దసరా పండుగలను పురస్కరించుకుని చీరలను అందజేశారు. సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ సమాజంలో సగం జనాభా మహిళలేనని, మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. డ్వాక్రా అంటేనే చంద్రబాబు అని ,మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేలా భారతదేశంలోనే తొలిసారిగా స్వయం సహాయక సంఘాల ఉద్యమాన్ని విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనన్నారు. మహిళల పొదుపు శక్తిని సంఘటిత శక్తిగా మార్చి, బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేశారని చెప్పారు. డ్వాక్రా సంఘాల ద్వారా లక్షలాది మహిళలు చిన్న వ్యాపారాలు, పశుపోషణ, కుట్టు కేంద్రాలు, ఆహార ఉత్పత్తులు, హస్తకళలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారారని వివరించారు. ఒకప్పుడు కుటుంబ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడిన మహిళలు నేడు కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. డ్వాక్రా ఉద్యమ విజయాల్లో వీఓఏలు, వీఓబీల పాత్ర అత్యంత కీలకమని మంత్రి కొనియాడారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ నాయకులు అంటే ఎన్నికల సమయంలోనే కనిపిస్తారని ప్రజల్లో ఉండే భావనను ఎప్పుడు ప్రజలతో మమేకమవుతు పూర్తిగా మార్చివేసిన నాయకుడు మంత్రి నిమ్మల రామానాయుడు అని తెలిపారు. గత రెండు ఏళ్ల క్రితం బుడమేరు ముంపు గురైనప్పుడు ఎవరు ఉండని విధంగా రాత్రింబవళ్లు గట్టుపైనే ఉండి ముంపు నివారణ పనులను దగ్గరుండి చేయించారంటూ కొనియాడారు కూటమి నాయకులు కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం చిన్నబాబు , కర్నేన గౌరు నాయుడు, జక్కంపూడి కుమార్, రియా, పాముల రజనీ కుమార్, పొట్నూరి శ్రీనివాస్, ఇంటి శ్రీరాముడు, పీతల శ్రీనివాస్, కొల్లి కొండ ప్రసాద్, ధనాన్ని సూర్యప్రకాష్, దాసరి రత్నం రాజు, పాలవలస తులసిరావు, మేడిది జాన్ రాజు , కలిదిండి రామచంద్ర రాజు,,దొడ్డ ఏడుకొండలు, మండేల రాంప్రసాద్, సత్యనారాయణ రాజు, నెక్కంటి ఆదినారాయణ, కిలారి రామారావు, వరద శేషు తదితరులు , పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉత్సవంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన



**పోడూరు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** పోడూరు సెక్టార్ వెలగల అమ్మచెరువు అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ ఇందిర ఆదేశాల మేరకు అంగన్వాడీ ఉత్సవం నిర్వహించారు. సూపర్వైజర్ హసీనా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కూటమి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. గర్భిణులకు నిర్వహించే ఆరోగ్య పరీక్షలు, బాలింతలు పాటించాల్సిన జాగ్రత్తలు, పిల్లల సంరక్షణ, కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, ఉప సర్పంచ్ శిలబోయిన జయ రామ కృష్ణ, మాజీ సొసైటీ చైర్మన్ రుద్రరాజు సీతారామరాజు (రవిరాజు), సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి పురుషోత్తముడు, జవ్వాది నానాజీ, చిలుకూరి ప్రసాద్గ,డాల దుర్గారావు, గెద్దాడ ఆంజనేయులు, మండల రైతు విభాగం అధ్యక్షులు బొక్క సూర్యనారాయణ,గుత్తులు వెంకటేశ్వరరావు,కూటమి నాయకులతో పాటు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పాల్గొన్నారు.

## జిన్నూరు మోడల్ స్కూల్కు రమణ ప్రసాద్ రాజు చేయూత

### రూ.1.50 లక్షలతో మరమ్మతులు.. విద్యార్థుల సంక్షేమానికి నిరంతర సేవలు

**పోడూరు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** పోడూరు మండలం జిన్నూరు గ్రామంలోని మోడల్ స్కూల్ అభివృద్ధికి గ్రామ ప్రముఖుడు, దాత పెనుమత్స రమణ ప్రసాదరాజు తన సొంత నిధులతో రూ.1.50 లక్షలు వెచ్చించి పాఠశాల భవనానికి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పాడైన తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేయించడంతో పాటు పూర్తిగా దెబ్బతిన్న వాటి స్థానంలో నూతన తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయించారు. వాటికి రంగులు వేయించడంతో పాఠశాల భవనం నూతన సొబగులు సంతరించుకుంది. దోమల నివారణకు మెష్లను కూడా ఏర్పాటు చేయించారు. త్వరలో పాఠశాల భవనానికి పూర్తిస్థాయిలో నూతన రంగులు వేయిస్తానని రమణ ప్రసాదరాజు హామీ ఇచ్చారు. హైదరాబాద్లో స్థిరపడినప్పటికీ తన స్వగ్రామమైన జిన్నూరుతోపాటు తాను చిన్నతనంలో చదువుకున్న పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గతంలో పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ను బహూకరించడంతో పాటు విద్యుత్ మరమ్మతు



పనులను సైతం సొంత ఖర్చులతో చేయించారు. విద్యార్థులందరికీ ప్రముఖ ఆసుపత్రి వైద్యులతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్లు అందించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి నిరంతరం సహకరిస్తున్న రమణ ప్రసాదరాజుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

**నేపాల్ వరద బాధితులకు సైతం ఆర్థికసాయం**

మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రమణ ప్రసాదరాజు నేపాల్ వరద బాధితుల సహాయార్థం రూ.5 వేల విరాళాన్ని అందించారు. టెనా అధ్యక్షుడు ఈశ్వర్ రమణ ద్వారా ఢిల్లీలోని నేపాల్ రాయబారి కార్యాలయ అధికారులకు చెక్కును అందజేశారు. సొంత గ్రామంలోని విద్యార్థులు, ప్రజలకే కాకుండా విదేశాల్లోని బాధితులకు సైతం తనవంతు సహాయం అందించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు. సేవే లక్ష్యం అనే స్ఫూర్తితో తన తండ్రి పేరుతో నిర్వహిస్తున్న రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత 28 ఏళ్లుగా రమణ ప్రసాదరాజు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా రూ.4 నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు చేస్తూ అవసరంలో ఉన్న వారికి అన్నదానం, విద్యా సహాయం, వైద్య సహాయం, వస్త్రదానం తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## పెద్దిరాజుకు వైసీపీ నాయకుల అభినందనలు



**పోడూరు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** రాష్ట్ర వైఎస్సార్సీపీ (పార్లమెంట్) కార్యదర్శిగా నియమితులైన మాజీ పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజును వైఎస్సార్సీపీ నాయకులు కలిసి అభినందించారు. రాహుల్ సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, వైసీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు వీరా మల్లికార్జునుడు పెద్దిరాజును కలిసి చిరు సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాగరాజు రమేష్, కుచ్చర్లపాటి కొండరాజు, నాగరాజు బాలాజీ రాజు, గుంటూరి దుర్గ ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ క్షీరా రామలింగేస్వర స్వామి దేవుస్థాన కార్య నిర్వహణ అధికారిగా శ్రీనివాసరావు



**పాలకొల్లు, సెప్టెంబర్ 26,మనం ప్రతినిధి :** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీరా రామలింగేస్వర స్వామి దేవుస్థాన నూతన కార్య నిర్వహణ అధికారి గా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, విజయవాడ ఉత్తర్వులు మేరకు ఆర్ శ్రీనివాసరావు ఉద్యోగ బాధ్యత లు చేపట్టారు . ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మీసాల రామచంద్ర రావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు సమక్షంలో ఈఓ శ్రీనివాస్ రావు బాధ్యత లు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తు దేవస్థానం అభివృద్ధి కి మంత్రి నిమ్మల సమక్షంలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్ ఉత్సవం



- **పాల్గొన్నఎంఏ షరీఫ్, పొత్తూరి రామరాజు**

**నరసాపురం, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అంగన్వాడీ ఉత్సవం ద్వారా చిన్నారులు, తల్లులు, మరియు కుటుంబాలకు పోషకాహారం, ఆరోగ్యం, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పేర్కొన్నారు. నరసాపురం పట్టణం 12వ వార్డులోని మున్సిపల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్ - అంగన్వాడి ఉత్సవం కార్యక్రమంలో ఎంఏ షరీఫ్, పొత్తూరి రామరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు ఎంతో ముఖ్యమైనవని అన్నారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్వాడి సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందిస్తూ, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంగన్వాడి కేంద్రాలను మరింత బలోపేతం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సూరిబాబు కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ నాయకులు



**పోడూరు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** మాజీ ఆచంట ఏఎంసీ చైర్మన్, వైసీపీ నాయకుడు చేకూరి సూర్యనారాయణరాజు (సూరిబాబు) తండ్రి రామకృష్ణంరాజు ఇటీవలే పరమపదించిన విషయం తెలుసుకున్న రాహుల్ సామాజిక సేవా సంస్థ, వృద్ధాశ్రమం అధినేత, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు శనివారం పోడూరులోని చేకూరి సూర్యనారాయణ రాజు (సూరిబాబు) నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. రామకృష్ణంరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు వీరా మల్లికార్జునుడు, శివాజీ రాజు, వరహాలు రాజు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లో సేవా సంకల్ప కార్యక్రమాలు



- **గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన**

**పోడూరు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** పాలకొల్లు ప్రాజెక్టు పోడూరు మండల పరిధిలోని జిన్నూరు సెక్టార్ జిన్నూరు కొత్తపేట, భూపయ్యచెరువు అంగన్వాడీ కేంద్రాలతో పాటు గుమ్ములూరు మెయిన్ అంగన్వాడీ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీఓ ఉమా ఆదేశాల మేరకు సెక్టార్ సూపర్వైజర్లు కె. మోహనరాణి, హేమతులసీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం నాణ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలకు టీకాలు సకాలంలో వేయించడం, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యాబోధనపై వివరించారు. ఈ సందర్భంగా పోడూరు మండల బీజేపీ అధ్యక్షుడు చింతపల్లి రమేష్శెట్టి మాట్లాడుతూ కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ అధ్యక్షుడు కుడిపూడి జయరాజు, ఏసీడీపీఓ పి. నాగరత్నం, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు, ఇతరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీమోల్లంగన



- **ముగిసిన పీఠాధిపతుల చాతుర్మస దీక్షలు**
- **మూల రాములకు ప్రత్యేక పూజలు**
- **ప్రత్యేక వాహనంలో పీఠాధిపతులు ఊరేగింపు**

మంత్రాలయం సెప్టెంబర్ 26( మనం న్యూస్) :- ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ఆగస్టు నెల 10 వ తేదీన సోమవారం నుంచి 48 రోజుల పాటు చేపట్టిన 14వ చాతుర్మస దీక్షలు శనివారం ముగియడంతో పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మఠం అధికారులు సీమోల్లంగన కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు మఠం నుంచి పల్లకిలో ఊరేగుతూ వచ్చి ముఖ ద్వారం నుంచి వాహనంలో గోశాల దగ్గర ఉన్న కొండాపురం చేరుకుని అక్కడ ఆంజనేయ స్వామి కి విశిష్ట పూజలు నిర్వహించి భక్తుల ను ఆశీర్వాదించారు. అక్కడ నుండి రాఘవేంద్ర సర్కిల్ దగ్గర ప్రత్యేకంగా అలంకరించిన వాహనం లో ఆశీనులై భాజ భజంత్రీల, భక్తుల కోలాహలం మద్య మఠం వరకు ఊరేగించారు. అంతకు ముందుగా రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంస్థాన పూజల్లో భాగంగా రామమందిరం లో మూల రాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్కే శ్రీనివాస్ రావు, , వెంకటేష్ జోషి ,శ్రీపతి, సీఆర్వో ఐపి నరసింహ, వ్యాసరాజ చార్ , ఇంజనీర్ కోనాపూర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలు, అంగన్వాడిలలో తాసిల్దార్ తనిఖీలు



**నరసాపురం, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ పంచాయతీ పరిధిలోని వేములదీవి, కాపులకొడప గ్రామాలలోని జిల్లా పరిషత్ హైస్కూలు, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ సెంటర్లతోపాటు బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో శనివారం నరసాపురం తాసిల్దార్ ఇ. నాగార్జున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులు, టాయిలెట్లు, వంట గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. విద్యార్థుల హాజరు నమోదును పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించి స్వయంగా రుచి చూసిన తాసిల్దార్ భోజనం రుచికరంగా ఉంటుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో రాజీ పడొద్దని, విద్యార్థులు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని ఈ సందర్భంగా తాసిల్దార్ నాగార్జున సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రెవెన్యూ అధికారులు, పాఠశాల, అంగన్వాడి సెంటర్ల సిబ్బంది పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెంలో ఘనంగా ఏలూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం



- **కుక్కునూరు మండలానికి తొలిసారిగా దక్కిన చోటు**

**కుక్కునూరు, సెప్టెంబర్ 26 ( మనం న్యూస్ ):** ఏలూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం జంగారెడ్డిగూడెంలో అట్టహాసంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లాలో తొలిసారిగా కుక్కునూరు మండలం నుంచి ముగ్గురు నాయకులు జిల్లా స్థాయి పదవులకు ఎన్నికవడం విశేషం. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో నడిపల్లి చక్రధర్ రావు జిల్లా ఉపాధ్యక్షులుగా, సమయమంతుల లక్ష్మణస్వామి వాసవి సేవాదళ్ ఉపాధ్యక్షులుగా చిన్ని చంద్రమోహన్, వాసవి సేవాదళ్ అదనపు కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎన్నిక అయిన నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యతకు, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అన్న సమారాధనలో పాల్గొన్న కొవ్వలి నాయుడు



**నరసాపురం, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** విఘ్నాలు తొలగించే వినాయకుడి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు. నరసాపురం పట్టణంలోని 6వ వార్డులో కోవెలగుడి వద్ద ఏర్పాటు చేసిన శ్రీ గణపతి నవరాత్రుల 20వ వార్షికోత్సవ మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ. గత 20 సంవత్సరాలుగా కమిటీ సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడు అభిమానులు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# విమానయాన రంగంలో యువతకు మంచి అవకాశాలు




## మంత్రి టీజీ భరత్

**కర్నూలు సెప్టెంబర్ 26(మనం న్యూస్):** విమానయాన రంగంలో యువతకు మంచి అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ ప్రారంభోత్సవంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో విమానయాన రంగం అభివృద్ధితో పాటు పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కర్నూలులో ఓరియంట్ ఫ్లైట్ ఏవియేషన్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆంధ్రప్రదేశ్లో తొలిసారిగా ఇలాంటి శిక్షణ కేంద్రం ఏర్పాటు కావడం ప్రత్యేకమన్నారు. . కర్నూలు విమానాశ్రయ అభివృద్ధి, విమాన సర్వీసుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్లో ఓరియంట్ సంస్థ మరిన్ని విభాగాలను విస్తరించే ఆలోచన ఉంటే కర్నూలును కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కర్నూలులో ఇప్పటికే విమాన సౌకర్యం అందుబాటులో ఉన్నందున, భవిష్యత్లో సంస్థ మరిన్ని ప్రాజెక్టులు, శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి తెలిపారు. కర్నూలులో విమానయాన రంగం అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు అనేక అవకాశాలు ఉన్నాయి. అడుగడుగునా మౌలిక వసతులను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగితే కర్నూలు మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. ఓరియంట్ ఫ్లైట్ ఏవియేషన్ అకాడమీ ఏర్పాటు కర్నూలు యువతకు గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. పైలట్ శిక్షణ పూర్తిచేసుకున్న అనంతరం దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. వైద్యులు, ఇంజనీర్లు వంటి సంప్రదాయ వృత్తులతో పాటు విమానయాన రంగంలో కూడా స్థానిక యువతకు మంచి కెరీర్ అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.



## కర్నూలులో సూపర్స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్

**కర్నూలు సెప్టెంబర్ 26(మనం న్యూస్):** కర్నూలు నగరంలోని గాంధీనగర్ సర్కిల్లో ఏర్పాటు చేసిన సూపర్స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి శ్రీ టీజీ భరత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. సూపర్స్టార్ కృష్ణ ఎంతో క్రమశిక్షణ కలిగిన నటుడని అన్నారు. 350కి పైగా చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న గొప్ప నటుడు సూపర్స్టార్ కృష్ణ అని కొనియాడారు. కర్నూలు నగరంలో సూపర్స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని మంత్రి తెలిపారు. అభిమానులు తమ అభిమాన హీరోలపై ఉన్న ప్రేమను సేవా కార్యక్రమాల ద్వారా చాటుకోవాలని మంత్రి టీజీ భరత్ సూచించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను అభిమానులు నిరంతరం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా పోలీసులు సేవలు అందించాలి




**కర్నూలు, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా పోలీస్ కానిస్టేబుల్స్ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా తెలిపారు. స్థానిక కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్లో 629 మంది ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా , కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ , జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి , కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ , బెటాలియన్ కమాండెంట్ దీపిక ఎం.పాటిల్ అందచేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శిక్షణ పొందిన కానిస్టేబుల్స్కు అభినందనలు తెలిపారు.. 9 నెలల పాటు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి పాసింగ్ అవుట్ పరేడ్లో క్రమశిక్షణతో, సమన్వయంతో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతి అంశాన్ని ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం ద్వారా శిక్షణ ఎంత పకడ్బందీగా జరిగిందో స్పష్టమవుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుత కాలంలో సాంకేతికతలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, పోలీసు విధుల్లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని మంత్రి పోలీస్ లకు సూచించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సీసీటీవీ కెమెరాలు, వాహనాల కదలికల విశ్లేషణ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా నేరాల దర్యాప్తు, నిందితుల గుర్తింపును మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు. పోలీసులు విధి నిర్వహణలో 'అవుట్ ఆఫ్ ది బాక్స్ థింకింగ్' తో వినూత్నంగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, కర్నూలు ఆక్టోపస్ 2వ బెటాలియన్ డిఎస్పీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు..

# పరిశ్రమల స్థాపనలో జాప్యానికి అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలి

**కర్నూలు, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** పరిశ్రమల స్థాపనలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టి నిర్మాణ పనులు వేగవంతంగా చేయలేని రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మరియు ఆహార శుద్ధి శాఖ మంత్రి టి. జి భరత్ గుప్తా పేర్కొన్నారు. జిల్లాలోని పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, భూకేటాయింపులు, అనుమతులు, మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ, ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో



సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ గుప్తా మాట్లాడుతూ... జిల్లాలో ప్రభుత్వం నుంచి ఎం.వో.యు ఆయన ప్రాజెక్టులో 42 కాగా వాటిలో 11 గ్రౌండింగ్ పనులు మొదలుకాగా మిగిలిన వాటిని కూడా డిసెంబర్ 10 లోగా త్వరగా ప్రారంభించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు, భూకేటాయింపులు పొందిన పరిశ్రమలు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూకేటాయింపులు పూర్తయినప్పటికీ ఫౌండేషన్ పనులు ప్రారంభించని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న సమస్యలను గుర్తించి సత్వరంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో త్రీ-డీ ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ పరికరం ను ప్రారంభించిన మంత్రి

**కర్నూలు, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రాయలసీమలోనే అత్యుత్తమ వైద్య సేవలు అందించడం జరుగుతున్నది రాష్ట్ర పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ గుప్త ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో త్రీ-డీ ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ పరికరం ను ప్రారంభించు సందర్భంగా పేర్కొన్నారు. శనివారం ఉదయం కర్నూలు ప్రాంతీయ కంటి వైద్యశాలలో 28 లక్షల 50 వేల రూపాయల విలువైన త్రీడీ ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ పరికరమును పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్త ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ ప్రాంతీయ కంటి వైద్యశాలకు ప్రతిరోజు దాదాపు 400 మంది వైద్యం కొరకు



వస్తారని తెలిపారు. రాయలసీమలోనే అత్యుత్తమ వైద్యుల సలహాలు , చికిత్స మరియు వైద్య సేవలు ప్రజలకు కర్నూలు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రమే లభిస్తున్నాయని తెలిపారు. ఈ పరికరం రాయలసీమలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రి లోనూ లేదని మంత్రి తెలిపారు. దీనితో ప్రజలు ఉచితంగా కంటి రెటీనా సమస్యలను సూక్ష్మ స్థాయి లో తెలుసుకోవచ్చని తెలిపారు.ఈ పరీక్ష బయట చేసుకుంటే దాదాపు 3 వేల రూపాయలు చెల్లించవలసి ఉంటుందని , ఈ పరీక్షతోపాటు 25 వేల రూపాయల విలువైన సూది మందులు ఉచితంగా ప్రజలకు లభిస్తాయని మంత్రి తెలిపారు. కావున ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపర్ ఇంటెండెంట్ డాక్టర్.ఎం.సత్యనారాయణ రెడ్డి, జి.జి.హెచ్ సూపర్ఇంటెండెంట్ డాక్టర్.కె.వెం కటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డా. సీ.ఎస్. కె.ప్రకాష్, కంటి ఆసుపత్రి హెచ్ ఓ డి యుగంధర్ రెడ్డి, డాక్టర్లు కే.ఎల్.ఎన్ రాజు, కిరణ్ కుమార్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డా. ప్రవీణ్ , సాయి ప్రదీప్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

## నియోజకవర్గంలోని 135 మందికి రూ.51.24 లక్షల సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి



**మంత్రాలయం, సెప్టెంబర్ 26(మనం న్యూస్);** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో 20వ విడత మంజూరైన 135 మందికి రూ.51.24 లక్షల సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఐటీ , విద్య శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ మండలాధ్యక్షుడు గోపాల్ రెడ్డి , టీడీపీ యువ నాయకులు ఎన్ . రాకేష్ రెడ్డి , క్లస్టర్ ఇన్చార్జ్ చావిడి వెంకటేష్ , పవన్ కుమార్ , కల్లుదేవకుంట సొసైటీ డైరెక్టర్ ఆర్ లక్ష్మన్న , మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ , నాలుగు మండలాల కూటమి నాయకులు, పల్లెపాడు రామిరెడ్డి , ముత్తురెడ్డి , వెంకటపతి రాజు , క్లస్టర్ ఇంచార్జిలు గ్రామ అధ్యక్షులు, యూనిట్,బూత్ ఇన్చార్జులు,టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.₹

# బంగారు గొలుసు దొంగలించిన నిందితులు అరెస్ట్

- **రిమాండ్ కు తరలింపు**

**బేతంచెర్ల సెప్టెంబర్26 (మనం న్యూస్):** ఈ నెల 23. వ తేదీన మధ్యాహ్నం సుమారు 2గ,, లకు పట్టణ నికి చెందిన మాలి సరస్వతి బేతంచెర్ల టౌన్ లోని వీరారెడ్డి ఇంటిదగ్గర వెళ్తూ ఉండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పల్సర్ మోటార్ సైకిల్ పైన ఆమెను ఫాలో అయ్యి ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ ని దొంగిలించుకొని పోయినారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఫిర్యాదు మేరకు పట్టణం లో పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు కేసు విచారణలో భాగంగా బేతంచెర్ల సీఐ ఖిఐ వారి సిబ్బంది ఈ రోజు ముద్దాయిలు ఉన్న ప్రదేశం సమాచారం రావడంతో సిమెంట్ నగర్ గ్రామం



వెలుపల గల సుంకులమ్మ గుడి వద్ద ఆరంగుల మద్దిలేటి వయసు 26 సం,, లు తండ్రి ఆరంగుల చిన్నన్న హరిజనవాడ నంద్యాల టౌన్ మరియు ఆరంగుల మధుకుమార్ వయసు 22 సం,, లు తండ్రి ఆరంగుల కృష్ణ హరిజనవాడ నంద్యాల టౌన్ అనువారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి చోరీ సొత్తు అయిన బంగారు చైన్ రికవరీ చేసి వాళ్ళు నేరం చేయడానికి ఉపయోగించిన పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీన పరచుకొని ఎస్ఐ రమేష్ బాబు వారిని రిమండ్ తరలిస్తున్నట్టు తెలిపారు

# ఆకు కూరలతోనే ఆరోగ్యం



**మహానంది, సెప్టెంబర్26,మనంన్యూస్:** ఆకు కూరలతో ఎంతో ఆరోగ్యం పొందవచ్చునని అంగన్వాడీ నిర్వాహకులు తెలిపారు. శనివారం మహానంది మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో గర్భవతులకు, బాలింతలకు రోజువారి ఆహారంలో ఆకు కూరలు, కూర గాయాలు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలగురించి అవగాహన కల్పించారు. రోజు వీటిని తీసుకుంటే తల్లీ, బిడ్డ ఆరోగ్యం గా ఉంటారన్నారు.అలాగే చిన్నారులకు ఆట వస్తువులను చూపించి అవగాహన కల్పించారు.

# మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

**బేతంచేర్ల సెప్టెంబర్ 26( మనం న్యూస్):** మండలంలో మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ జఫ్ఫుల్లా సూచించారు బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో ఒకటి గ్రామీణ ప్రాంతాల్లో రెండు దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు ఒక్కో దుకాణానికి దరఖాస్తు రుసుము రూ,,3 లక్షలు స్లాబ్ ప్రకారం రూ.60.50 లక్షలు పర్మిట్ రూమ్కు రూ.5 లక్షలు ప్రాసెసింగ్ ఫీజు రూ,,1,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 1లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు దరఖాస్తులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత లైసెన్సారులు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో సమావేశం నిర్వహించి దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సోమశేఖర్ దరఖాస్తు దారులు పాల్గొన్నారు





# వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**మంత్రాలయం, సెప్టెంబర్ 26 మనం న్యూస్;-** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లో రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రవేయిట్ అతిథి గృహంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన ధీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచారని, ఆమె పోరాట పటిమ, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు.. ఈ కార్యక్రమంలో పోస్ట్ భీమయ్య, గోవిందు, భీమయ్య, అంజి, శీను, మాధవరం భీమయ్య, మద్దిలేటి, చాకలి రాము, కృష్ణ, రాగప్ప, రమేష్, జిమ్మీ, బడే సాబ్, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల సంక్షేమం..

# ప్రజారోగ్యమే లక్ష్యం



**కర్నూలు, సెప్టెంబర్ 26:మనం న్యూస్** కర్నూలు జిల్లాలోని జిల్లా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి.. వారి మధ్య సమన్వయం, పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి, సంక్షేమాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) కర్నూలు జిల్లా ఆసుపత్రుల విభాగానికి తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారికి కమిటీ ఏర్పాటు విషయాన్ని అధికారికంగా తెలియజేశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

జిల్లా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యుల వృత్తిపరమైన, సంక్షేమపరమైన అంశాలపై సంబంధిత అధికారులతో చర్చిస్తూ నిర్మాణాత్మకంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలు, అధికారిక ఆదేశాలకు అనుగుణంగా సంఘం బాధ్యతాయుతంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



**కర్నూలు, సెప్టెంబర్ 26 మనం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్ కార్యక్రమం ద్వారా రాయలసీమ ప్రాంతంలో ఉద్యాన రంగం, నీటిపారుదల, గ్రామీణ రహదారులు, కోత అనంతర మౌలిక వసతులు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ తదితర రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన పంటల అభివృద్ధి, రైతులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాల కల్పన, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లతో సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక అమలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వ, ప్రపంచ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ మద్దతు పథకాల ద్వారా సుమారు రూ.40 వేల కోట్లు, ప్రైవేట్ పెట్టుబడుల భాగస్వామ్యంతో సుమారు రూ.60 వేల కోట్లు సమీకరించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. కర్నూలు జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల అభివృద్ధికి సుమారు రూ.2,019 కోట్లు కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఏ.పీ.ఎం.ఐ.పి ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యాన శాఖ అధికారి రాజా కృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాయిల పసిడి కూత..
# ఆసియా క్రీడల్లో భారత్కు మరో గోల్

జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్కు మూడో స్వర్ణం వచ్చి చేరింది. కబడ్డీ పోటీల్లో డిఫెండింగ్ ఛాంపియన్గా బరిలోకి దిగిన మన అమ్మాయిలు.. ఫైనల్లో ఇరాన్ను ఓడించి బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ గేమ్లో 37-34 తేడాతో మన జట్టు ఇరాన్ నుంచి విజయాన్ని లాగేసుకుంది. మరోవైపు రైఫిల్ షూటింగ్లో రజతం దక్కగా.. స్క్వాష్ జోడీ సెమీస్లో తడబడి, కాంస్యంతో సరిపెట్టుకుంది.




● 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్ లో తిలోత్తమా సేన్, విదర్శా వినోద్, ఆషి చౌక్సే రజతాన్ని సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో చైనా బృందం 1773 పాయింట్లతో పసడి పతకాన్ని దక్కించుకోగా.. భారత బృందానికి 1763 పాయింట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచింది. 1754 పాయింట్లు సాధించిన కజకిస్థాన్కు కాంస్యం దక్కింది.

● ఇక, స్క్వాష్ విభాగంలో మిక్స్డ్ డబుల్స్ జోడి జోష్న చిన్నప్ప-సెంథిల్ కుమార్ కు కాంస్య పతకం దక్కింది. సెమీస్లో హాంకాంగ్ ద్వయం లీ కా యి, తాంగ్ మింగ్ హాంగ్ చేతిలో ఓడింది.

● అంతకుముందు, భారత అథ్లెట్, హవల్దార్ సావన్ బర్వాల్ మారథాన్లో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో రజతంతో మెరిసి 44 ఏళ్ల తర్వాత మన దేశానికి పతకం అందించాడు.

# ఇదే నా చివరి ప్రపంచకప్..: కోహ్లీ

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచ కప్.. దేశం తరఫున తాను ఆడే చివరి మెగా టోర్నీ అని స్పష్టం చేశాడు. ఆ ట్రోఫీని కైవసం చేసుకునేందుకు మైదానంలో తన సర్వశక్తులూ ధారపోస్తానని తెలిపాడు. ఈ నెల 27 నుంచి వెస్టిండీస్తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్కు ముందు 'జియోస్టార్'తో కోహ్లీ మాట్లాడాడు. వచ్చే ఏడాది సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా వన్డే ప్రపంచకప్నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

''భారత్ తరఫున ఆడబోయే చివరి వరల్డ్కప్ ఇదే. టోర్నీని గెలవడమే నా ఏకైక లక్ష్యం. దాని కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు, మైదానంలో సర్వస్వం ధారపోసేందుకు సిద్ధంగా ఉన్నా'' అని కోహ్లీ వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్లో ఉండే ఇంటెన్సిటీ మరే ఇతర టోర్నమెంట్లోనూ ఉండదని చెప్పాడు. ''ఇందులో దాదాపు 10 మ్యాచ్లను టీ20 స్థాయి తీవ్రతతో ఆడాల్సి ఉంటుంది. ఒక వన్డే మ్యాచ్ అనేది 2.5 టీ20లతో సమానం. పెద్ద టోర్నమెంట్ లేదా ప్రపంచకప్లో వరుసగా 10 మ్యాచ్లపాటు ఆ ఇంటెన్సిటీని కొనసాగించడం చాలా పెద్ద విషయం.'' అని తెలిపాడు.

**అదే అసలైన సవాలు: రోహిత్ శర్మ**

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ..




''నేను చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన ఎప్పుడూ రాదు. ఆడుతున్నంత కాలం.. ఏదో ఒక లక్ష్యం కోసం ఎదురుచూస్తూనే ఉంటాం. ప్రస్తుతం ప్రపంచకప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రపంచకప్ లేదా ఏదైనా ఐసీసీ టోర్నమెంట్ ఆడేటప్పుడు వేర్వేరు వేదికలపై.. వేర్వేరు ప్రత్యర్థులను ఎదుర్కొంటాం. కాబట్టి, అందుకు తగినట్లు విభిన్నంగా సిద్ధం కావాలి. కొత్తగా ఆలోచించాలి. అదే అసలైన సవాలు'' అని పేర్కొన్నాడు. రాబోయే వన్డే వరల్డ్కప్ వరకు ఆడతారా? లేదా? అనే సందేహాలకు ఈ ఇద్దరు తమ వ్యాఖ్యలతో తాజాగా చెక్పెట్టినట్లయ్యింది.

## సాత్విక్ జోడీకి షాక్

ఆసియా క్రీడల్లో బ్యాడ్మింటన్లో భారత్కు అతి పెద్ద షాక్. స్వర్ణం తెస్తుందనే అంచనాలతో టోర్నీలో అడుగుపెట్టిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలో దిగిన సాత్విక్-చిరాగ్ ద్వయం 21-12, 19-21, 14-21తో పకాపోన్-పీరాట్చాయ్ (థాయ్లాండ్) జంట చేతిలో అనూహ్యంగా కంగుతింది. తొలి గేమ్ తేలిగ్గా గెలిచి జోరు మీద కనిపించిన భారత జంట.. తర్వాత తడబడింది. రెండో గేమ్లో సాత్విక్ జోడీ ఆరంభంలో బాగానే ఆడినా.. తర్వాత పట్టు సడలించింది. దీంతో విరామ సమయానికి 11-9తో ఆధిక్యంలో నిలిచిన థాయ్ జంట.. ఆపై గేమ్ గెలిచి స్కోరు సమం చేసింది. నిర్ణయాత్మక మూడో గేమ్లో సాత్విక్ జోడీది అదే ఆట. మొదట దూకుడుగా ఆడిన భారత ద్వయం.. తర్వాత వెనుకబడి ఆపై ఓటమి వైపు నిలిచింది. మహిళల డబుల్స్లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జంట శుభారంభం చేసింది.. తొలి రౌండ్లో గాయత్రి జోడీ 21-16, 16-21, 21-16తో హి యాన్ సాంగ్-లుక్ లుక్ (హాంకాంగ్) జంటను ఓడించింది. కవిప్రియ-సిమ్రన్ ద్వయం 9-21, 5-21తో ఫెబ్రియానా-ట్రియాస్ (ఇండోనేసియా) జంట చేతిలో ఓడగా.. మిక్స్డ్ డబుల్స్లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల ద్వయం క్వార్టర్స్ చేరింది. ప్రిక్వార్టర్స్లో తనీషా జంట 21-8, 21-7తో నిబాల్-నబీహా (మాల్దీవులు) జోడీపై గెలిచింది.

## 'లవ్ అండ్ వార్' నుండి విక్కీ కౌశల్ ఇంటెన్స్ ఫస్ట్లుక్ విడుదల




సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'లవ్ అండ్ వార్' పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. రణబీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలో ప్రత్యేక చిత్రంగా నిలిచేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రణబీర్ కపూర్, అలియా భట్ ఫస్ట్ లుక్ పోస్టర్లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా విక్కీ కౌశల్ ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పోస్టర్లో విక్కీ కౌశల్ సిగరెట్, లైటర్తో కనిపిస్తూ ఎంతో ఇంటెన్సా చూస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ఇప్పటివరకు చూడని విభిన్నమైన లుక్లో విక్కీ కనిపించడం విశేషం. ఆయన లుక్లో స్టైల్, చార్మ్తో పాటు పాత్రలోని తీవ్రత కూడా స్పష్టంగా కనిపిస్తోంది. భన్సాలీ సినిమాల్లో హీరోల పాత్రలకు ప్రత్యేకమైన రూపాన్ని, స్టైల్ను అందిస్తుంటారు. అదే తరహాలో విక్కీ కౌశల్ లుక్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. రణబీర్, అలియా తర్వాత ఇప్పుడు విక్కీ ఫస్ట్ లుక్ కూడా 'లవ్ అండ్ వార్' పై అంచనాలను మరింత పెంచింది. విక్కీ పోస్టర్ మాత్రం సినిమాకు మరింత ఇంటెన్స్ టచ్ను తీసుకొచ్చింది. ఈ చిత్రం 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

## 'రామాయణ' నుంచి తెలుగులో 'జై జై రామ్' రిలీజ్

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన దక్కించుకోగా.. తాజాగా ఫస్ట్ సింగిల్ 'జై జై రామ్' ను తెలుగులో రిలీజ్ చేశారు మేకర్స్. దైవం, సంగీతం, సినిమాటిక్ గ్రాండియర్.. ఈ మూడు కలిసినప్పుడు ఆ అనుభూతి ఎలా ఉంటుందో చూపిస్తూ వచ్చిన ఈ తొలి సింగిల్ 'బ్రజీ బ్రజీ ఖురుఖ' ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ విశేష స్పందన దక్కించుకుంటుంది.

కాగా.. నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ విజువల్ వండర్ను అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇందులో రాముడి పాత్రలో రణబీర్ కపూర్, సాయి పల్లవి సీతాదేవిగా, యష్ రావణాసురుడిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణక పాత్రలో కనిపించబోతున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ భారీ



మైథలాజికల్ డ్రామా మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల చేయనున్నారు. ఇక రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## కబడ్డీలో భారత్కు డబుల్ బొనాంజా..

### అబ్బాయిలూ 'పసిడి' పట్టేశారు!

ఆసియా క్రీడల కబడ్డీలో మన అమ్మాయిలు, అబ్బాయిలు ఇరాన్ను గట్టిగానే ఢీకొట్టారు. ఇప్పటికే ఆ దేశాన్ని ఓడించి మహిళల జట్టు స్వర్ణాన్ని దక్కించుకోగా.. పురుషుల జట్టు అదే బాటలో నడిచింది. ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో పసిడి కూత పెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. ఇరాన్ను 40-34 పాయింట్ల తేడాతో ఓడించింది. దీంతో కలిపి ఆసియా క్రీడల చరిత్రలో కబడ్డీ జట్టు తొమ్మిదిసార్లు బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్కు ఇది నాలుగో స్వర్ణం.

**పతకాల పట్టికలో 10వ స్థానం..**

2026 ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు నాలుగు స్వర్ణాలతో భారత్ పతకాల పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. 11 రజతాలు, 13 కాంస్యాలతో కలిపి మొత్తం 28 పతకాలను సొంతం చేసుకుంది. మహిళల క్రికెట్ ఫైనల్లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో తొలి స్వర్ణాన్ని దక్కించుకోగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో సురుచి సింగ్, కమల్జీత్ జంట శుక్రవారం పసిడి సొంతం చేసుకున్నారు. ఇక, శనివారం కబడ్డీలో రెండు స్వర్ణాలు వచ్చాయి. 2022 ఆసియా క్రీడల్లో భారత్కు మొత్తం 106 పతకాలు వచ్చాయి. వాటిలో 28 గోల్డ్మెడల్స్. ఈసారి భారత్ నాలుగో స్థానంలో నిలవగా.. చైనా తొలి స్థానంలో నిలిచింది.




# అందం ఉన్నా అదృష్టం లేదు..



సినిమా ఇండస్ట్రీలో టాలెంట్ తో పాటు టైమింగ్, సరైన సినిమా, ఆ సినిమా ఫలితం కూడా కెరీర్ ను ప్రభావితం చేస్తుంటాయి. కొందరు నటీనటులకు మంచి అవకాశాలు వరుసగా వచ్చినా.. వాటిని విజయాలుగా మలుచుకోవడానికి మాత్రం చాలా సమయం పడుతుంది. ఇప్పుడు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్ పరిస్థితి కూడా దాదాపు ఇలానే కనిపిస్తోంది. అందం, అభినయం ఉన్న ఈ భామకు అవకాశాలు మాత్రం బాగానే వస్తున్నాయి. కానీ ఆమె ఖాతాలో మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు చేరడం లేదు.

**'అల్లూరి'తో టాలీవుడ్ ఎంట్రీ..**

కయాదు లోహర్ తెలుగులో తొలిసారి శ్రీ విష్ణు హీరోగా నటించిన 'అల్లూరి' సినిమాతో పరిచయమైంది. 2022లో వచ్చిన ఈ చిత్రంలో ఆమె సంధ్య పాత్రలో కనిపించింది. మంచి నటనతో ఆకట్టుకునే ప్రయత్నం చేసినా.. సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో టాలీవుడ్లో కయాదు తొలి అడుగే విజయాన్ని అందించలేకపోయింది.

ఆ తర్వాత కయాదు ఇతర భాషలపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా తమిళంలో 'డ్రాగన్' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమా తెలుగులోనూ విడుదలై ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దాంతో కయాదుకు దక్షిణాదిలో వరుస అవకాశాలు రావడం మొదలైంది.

**విశ్వక్ సేన్ తో 'ఫంకీ'..**

ఆ గుర్తింపుతోనే టాలీవుడ్లో మరో మంచి అవకాశం దక్కింది. విశ్వక్సేన్ హీరోగా అనుదీప్ కేవీ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఫంకీ'లో కయాదు హీరోయిన్గా నటించింది. ఈ సినిమాలో ఆమె చిత్ర పాత్రలో కనిపించింది. తెరపై కయాదు అందంగా కనిపించడంతో పాటు సహజమైన నటనతో ఆకట్టుకుందని రివ్యూల్లోనూ ప్రస్తావనలు వచ్చాయి.

అయితే సినిమా మాత్రం ప్రేక్షకులను పూర్తిగా మెప్పించలేకపోయింది. నెగెటివ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. దీంతో కయాదు ఖాతాలో తెలుగులో రెండో సినిమా కూడా విజయాన్ని నమోదు చేయలేకపోయింది.

**'ది ప్యారడైజ్'పై భారీ ఆశలు..**

ఇక కయాదు కెరీర్లో మరో కీలక అవకాశం 'ది ప్యారడైజ్'. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ఆమె సుబ్బలక్ష్మి అలియాస్ సుబ్బు పాత్రలో కనిపించింది. తన గత పాత్రలకు పూర్తి భిన్నంగా, కథలో కీలకమైన పాత్ర లభించిందని కయాదు స్వయంగా చెప్పింది. ఈ సినిమా తన కెరీర్లోనే అతిపెద్ద ప్రాజెక్ట్ అని కూడా పేర్కొంది.

సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది ప్యారడైజ్'కు మిశ్రమ స్పందన లభించింది. దీంతో కయాదు తెలుగులో నటించిన మూడు సినిమాల్లోనూ విజయం ఆమెకు దూరంగానే నిలిచింది. 'అల్లూరి', 'ఫంకీ' తర్వాత 'ది ప్యారడైజ్' కూడా ఆశించిన స్థాయిలో టాక్ తెచ్చుకోకపోవడంతో.. కయాదుకు కలిసి రావడం లేదనే చర్చ మొదలైంది.

ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. వరుస పరాజయాలు ఉన్నప్పటికీ కయాదుకు అవకాశాలు మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో పలు సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. 'ది ప్యారడైజ్'తో పాటు తమిళంలో మారి సెల్వరాజ్ ప్రాజెక్ట్, సూర్యతో ఓ సినిమా సహా పలు ప్రాజెక్టుల్లో ఆమె భాగమవుతోంది.

అంటే కయాదు విషయంలో టాలెంట్ లేదని కాదు.. అవకాశాలు రావడం లేదని కూడా కాదు. మంచి పాత్రలు దక్కుతున్నాయి. గుర్తింపు తెచ్చుకునే సినిమాల్లో నటిస్తోంది. కానీ ఆమె నటించిన సినిమాలు వరుసగా విజయం సాధించకపోవడమే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

అందం ఉంది.. అభినయం ఉంది.. అవకాశాలు కూడా ఉన్నాయి.. ఇక అదృష్టం కలిసొచ్చే ఆ ఒక్క హిట్ కోసం కయాదు ఎదురుచూస్తోంది. ఆ విజయం ఎప్పుడు వస్తుందో.. అదే ఆమె టాలీవుడ్ కెరీర్కు కీలక మలుపుగా మారొచ్చు.

# సంక్రాంతి మనదే.. 'కాకా' అప్ డేట్ పంచుకున్న చిరంజీవి



కదిరి కాళిదాస్గా 'కాకా'తో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను బాబీ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అనస్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా అప్ డేట్ ను చిరంజీవి పంచుకున్నారు. 'సిగ్మా' ప్రీరిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన చిరు.. 'కాకా' గురించి మాట్లాడారు.

''సినిమా ఫస్ట్ హాఫ్ పూర్తయింది. సెకండ్ హాఫ్ కూడా 30 శాతం అయిపోయింది. ఫస్ట్హాఫ్కు తమన్ బ్యాక్గ్రౌండ్ మ్యూజిక్ పనుల్లో బిజీగా ఉన్నారు. కచ్చితంగా ఈ సంక్రాంతికి వస్తున్నాం. పండగ మనదే'' అని చిరు అన్నారు. దీంతో జనవరి 13న ఈ సినిమా విడుదల ఖాయమని మరోసారి స్పష్టమైంది. అటు 'కాకా' టీమ్ ఫుల్ జోష్లో ఉంది. ఒకవైపు షూటింగ్ చేస్తూనే డబ్బింగ్ పనులు కూడా మొదలు పెట్టింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ ఓ వీడియోను కూడా షేర్ చేసింది.

**2027 సంక్రాంతి సినిమాలివే..**

వచ్చే ఏడాది పెద్ద పండగకు అగ్ర హీరోల సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీపడనున్నాయి. ఇప్పటికే చిరంజీవి 'కాకా' విడుదల ఖరారైంది. ఇక సంక్రాంతికి వచ్చి హిట్ కొట్టే దర్శకుడు అనిల్ రావిపూడి ఈసారి పండగకు 'జనవరి 12న విడుదల'తో రానున్నారు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ హీరోలుగా కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇక మరో అగ్రకథానాయకుడు రజనీకాంత్ నటిస్తోన్న 'ధర్మన్' కూడా సంక్రాంతికే రానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. వీటితో పాటు శర్వానంద్ 'జార్జ్ క్రిష్', సాయిదుర్గా తేజ్ 'సంబరాల ఏటి గట్టు', శ్రియారెడ్డి, అక్షయ్ ఖన్నా నటిస్తోన్న 'మహాకాళి' కూడా సంక్రాంతి బరిలో నిలవనున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.